“ మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

Published from Jagitial
www.evarthalu.com

మీరే విలేకరి.. “
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

| ఆదివారం SUNDAY 1-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 |
|---|---|---|---|
| | సంపుటి: 1 Volume:1 | సంచిక: 241 Issue: 241 | |


01 మార్చి 2026 - ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:38 సూర్యాస్తమయం - సా. 6:19 తిథి త్రయోదశి రా. 7:12 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం భాను వాసరః నక్షత్రం పుష్యమి ఉ. 8:32 వరకు తరువాత ఆశ్లేష యోగం శోభన మ. 2:33 వరకు కరణం కౌలవ ఉ. 7:54 వరకు తైతుల రా. 7:12 వరకు వర్జ్యం రా. 8:59 నుండి రా. 10:32 వరకు దుర్ముహూర్తం సా. 4:45 నుండి సా. 5:32 వరకు రాహుకాలం సా. 4:51 నుండి సా. 6:19 వరకు యమగండం మ. 12:28 నుండి మ. 1:56 వరకు గుళికాకాలం మ. 3:23 నుండి సా. 4:51 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:02 నుండి తె. 5:50 వరకు అమృత ఘడియలు ఉ. 6:17 నుండి ఉ. 7:50 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:05 నుండి మ. 12:51 వరకు



ఓ పాఠశాలలో 85 మంది విద్యార్థుల మృతి



# మిస్సైళ్ల విధ్వంసం

## ఇరాన్‌పై ఇజ్రాయెల్ క్షిపణుల దాడి

**తీవ్రంగా ప్రతిఘటించిన ఇరాన్ సైన్యం**

**ఏకకాలంలో 8 దేశాలపై క్షిపణుల దాడి**

**బిక్కుబిక్కుమంటున్న పశ్చిమాసియా జనం**

**భారతీయులకు కేంద్ర ప్రభుత్వం అడ్వైజరీ**

టెహ్రాన్: నిన్నటివరకు నివురు గప్పిన నిప్పులా ఉంటూ వచ్చిన ఇరాన్- ఇజ్రాయెల్ సంక్షోభం ఇప్పుడు ఒక్కసారిగా భగ్గుమంది. ఇరాన్ పై ఇజ్రాయెల్ భీకర దాడికి దిగింది. ఏకంగా ఆ దేశ రాజధాని టెహ్రాన్ పై మిస్సైళ్లు, డ్రోన్ బాంబులతో విరుచుకుపడింది. అమెరికాతో కలిసి ఇజ్రాయెల్ ప్రారంభించిన జాయింట్ తరువాయి 2 వ పేజీలో...



బాంబుల మోతతో దుబాయ్‌లో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ప్రజలు రోడ్ల మీదికి వచ్చి ఏ క్షణం ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. (దుబాయ్‌లో ఉంటున్న జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం కొండాపూర్‌కు చెందిన వ్యక్తి పంపిన చిత్రం)

### ఫ్లాష్.. ఫ్లాష్: ఖమేనీ ఖతం

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ హతం అయినట్లు తెలుస్తోంది. ఆయన మృతదేహాన్ని అమెరికా అధ్యక్షుడు, డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుకు భద్రతాదళాలు చూపించినట్లు తెలిసింది. ఈ మేరకు ఇజ్రాయెల్ వార్తా చానళ్లు వార్తలను ప్రసారం చేస్తున్నాయి. దీనిపై ఇరాన్ నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. అయితే, ఖమేనీ అల్లుడు, కోడలు దాడుల్లో హతమైనట్లు టెహ్రాన్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

# పటాకుల రక్తపాతం

## 23 మంది దుర్మరణం!

“ పటాకులు పేలినట్లు పేలిన శరీరాలు..
ఎగిరొచ్చి పొలాల్లో పడ్డ అవయవాలు..
గుర్తుపట్టలేనంతా ఛిద్రమైన మృతదేహాలు..
ఎటుచూసినా ఒళ్లు గగుర్పొడిచే దృశ్యాలు..
ఇదీ వేట్లపాలెంలో మృత్యు ఘోష..

**బాణసంచా తయారీకేంద్రంలో భారీ పేలుడు**

**ఏపీలోని కాకినాడ జిల్లాలో తీవ్ర విషాదం**

సామర్లకోట-కాకినాడ, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శనివారం సామర్లకోట మండలం వేట్లపాలెంలో ఉన్న సూర్య శ్రీ ఫైర్ వర్క్స్ అనే ఓ బాణాసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. టపాసులు తయారు చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించింది. దీంతో పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో భారీగా ఎగిసి పడుతున్న మంటల్లో చిక్కుకుని 23 మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. పలువురు గాయపడ్డారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. పేలుడు ధాటికి మృతదేహాలు అన్నీ చెల్లాచెదురుగా పడిపోయి ఆ ప్రాంతమంతా భీతావహ వాతావరణం నెలకొంది. పేలుడు తీవ్రతకు మృతదేహాలు, కాళ్లు, చేతులు పంటపొలాల్లో చెల్లాచెదురుగా తరువాయి 2 వ పేజీలో...



### బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,871 |
| వెండి (గ్రాము): | రూ.320 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,913 |



# హరీశ్ రావు ఎఫెక్ట్!

**శారదాపీఠం మఠం కూల్చడంపై మాజీమంత్రి ఫైర్**

**గుళ్లపై కాంగ్రెస్ కక్ష సాధిస్తోందని ఆగ్రహం**

కోకాపేట్ నియోపోలిస్‌లోని రాజశ్యామల అమ్మవారి ఆలయాన్ని బలవంతంగా ఖాళీ చేయించేందుకు రేవంత్ సర్కార్ ప్రయత్నిస్తుందన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఇవాళ ఉదయం కోకాపేట్ లో మీడియాతో మాట్లాడిన హరీశ్‌రావు.. మఠాన్ని కూల్చడమంటే మనోభావాలు దెబ్బతీయడమేనన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆలయ నిర్మాణానికి 2 ఎకరాల స్థలం కేటాయిస్తే, ఆ స్థలాన్ని లాక్కునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు.

కోకాపేట్-రంగారెడ్డి, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): పీఠం నిర్వాహకులను భయాందోళనలకు గురిచేయడంపై హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాలయాలపై కాంగ్రెస్ ప్రభుత్వ కక్షసాధింపు చర్యలు దారుణమని ఫైర్ అయ్యారు. దేవాలయాన్ని ఎందుకు కూల్చాలనుకుంటున్నారో సీఎం రేవంత్ రెడ్డి -2 వ పేజీలో...



# రేవంత్ కరెక్షన్..!

**మఠానికే భూములు కేటాయిస్తున్నట్లు ఆదేశాలు**

**జలమండలికి భూ కేటాయింపు రద్దు చేస్తూ నిర్ణయం**

కోకాపేట శారదా పీఠం భూములపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. జలమండలికి కేటాయించిన భూ కేటాయింపులు రద్దు చేశారు. ఆ భూములను శారదా పీఠానికే కొనసాగించాలని ఆదేశాలు జారీ చేశారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): నిర్మాణాల తాజా స్థితి తెలియజేయనందుకు.. అధికారులపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వివరాలు ఇవ్వాలని శారదా పీఠం ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. శనివారం -2 వ పేజీలో...

### విశ్వవాణి



న్యూయార్క్‌కు చెందిన టెర్రిక అనే గర్భిణి ఏకంగా 5.9 కిలోల బరువున్న బాలుడిని కన్నది. ఆ బాలుడు పుట్టడంతోనే 6 నెలల పిల్లలు వేసుకొనే డ్రెస్ వేసుకొన్నాడు. అంటే.. ఎంత భారీకాయమో అర్థం చేసుకోవచ్చు.

# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ



**ప్రారంభించిన ప్రధాని మోదీ**

**దేశవ్యాప్తంగా మొదలైన టీకా పంపిణీ**

సర్వైకల్ క్యాన్సర్‌పై ప్రధాని మోదీ దేశవ్యాప్త పోరాటానికి శ్రీకారం చుట్టారు. మహిళల్లో క్యాన్సర్ మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటైన గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నిర్మూలించే లక్ష్యంతో 14 ఏళ్లు పైబడిన బాలికల కోసం రూపొందించిన హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని రాజస్థాన్‌లోని అజ్మీర్ నుంచి లాంఛనంగా ప్రారంభించారు.

అజ్మీర్: ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని సమక్షంలో పలువురు పాఠశాల విద్యార్థినులకు టీకాలు వేశారు. అనంతరం మోదీ వారితో ముచ్చటించారు. ఈ బృహత్తర కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా లక్షలాది మంది బాలికలకు భవిష్యత్తులో క్యాన్సర్ ముప్పు నుంచి రక్షణ లభిస్తుందని ప్రభుత్వం ఆశాభావం -2 వ పేజీలో...



# అన్ని ఆలయాల్లో ‘విరోష్’ అన్నదానం

**నేడు దేశవ్యాప్తంగా నిర్వహణకు ఏర్పాట్లు**

**ప్రధాన నగరాలకు ట్రక్కుల నిండా స్వీట్లు**

టాలీవుడ్ నూతన దంపతులు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న తమ పెళ్లి వేడుకలను అభిమానులతో కలిసి జరుపుకునేందుకు భారీ ఏర్పాట్లు చేశారు. తమ జీవితంలోని ఈ కొత్త ప్రయాణాన్ని పురస్కరించుకుని, మార్చి 1న (ఆదివారం) దేశవ్యాప్తంగా పలు ఆలయాల్లో అన్నదానం చేయనున్నట్లు ప్రకటించారు.

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): దేశంలోని వివిధ నగరాలకు ట్రక్కుల నిండా స్వీట్లను పంపుతున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని సోషల్ -2 వ పేజీలో...



# రేపు తెలంగాణకు రాహుల్

**డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి హాజరు**

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సోమవారం తెలంగాణలో పర్యటించనున్నారు. వికారాబాద్ జిల్లా అనంతగిరిలో నిర్వహించనున్న జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. రాహుల్ గాంధీ ఒకరోజు పర్యటనకు సంబంధించిన పూర్తి వివరాలను ఏఐసీసీ -2 వ పేజీలో...

# రాశి ఫలాలు

1.3.2026

**మేషం:** ఉద్యోగ విషయమై శుభవార్తలు అందుతాయి. గృహమున సంతోషకర వాతావరణం ఉంటుంది. పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. కొన్ని పనులు అనుకూలంగా మారుతాయి. ఆకస్మిక ధన ప్రాప్తి కలుగుతుంది. వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. ఉద్యోగ అవకాశాలు పొందుతారు.

**వృషభం:** కుటుంబ విషయాలలో చిక్కులు కలుగుతాయి. ధనపరంగా ఇబ్బందులుంటాయి. ఖర్చులు అదుపు చేయడం మంచిది. పనులు నిదానంగా పూర్తవుతాయి. దైవ చింతన పెరుగుతుంది. వ్యాపారాలలో నిరుత్సాహ వాతావరణం ఉ ఒటుంది. ఉద్యోగాలలో కొందరి ప్రవర్తన విసుగు తెప్పిస్తుంది.

**మిధునం:** అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. బంధు మిత్రులతో సఖ్యత కలుగుతుంది. ఆకస్మిక ధనప్రాప్తి, సమాజంలో ఆదరణ పెరుగుతుంది. వస్త్ర ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు.

**కర్కాటకం:** కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యం కలిగిస్తుంది. నూతన ఋణాలు చేయవలసి రావచ్చు. ప్రయాణాలు వాయిదా వేస్తారు. వ్యాపారాలలో అకారణంగా వివాదాలు కలుగుతాయి. నిరుద్యోగులకు అధికారుల నుండి అనుకూలత ఉండదు. ప్రయాణాలలో ప్రమాద సూచనలు.

**సింహం:** చేపట్టిన పనులలో ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. సమాజంలో పెద్దలతో పరిచయాలు లాభిస్తాయి. ఊహించని ఆహ్వానాలు అందుతాయి. సమాజానికి ఉపయోగపడే పనులు నిర్వహిస్తారు. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు లభిస్తాయి. ఉద్యోగంలో అధికారుల నుండి ప్రశంసలు పొందుతారు.

**కన్య:** తండ్రి తరుపు బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ వాతావరణం ఉ త్సాహంగా ఉంటుంది. భూ సంబంధిత వివాదాలు పరిష్కారమవుతాయి. ఉద్యోగ విషయమై కీలకమైన నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపారాలలో ఆశించిన ఫలితాలు పొందుతారు.

**తుల:** ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు రెండు రకాలుగా మారుతాయి. కుటుంబ సభ్యుల ఒత్తిడి అధికమవుతుంది. స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. దైవ కార్యక్రమాలపై దృష్టి సారిస్తారు. అనారోగ్య సూచనలున్నవి. వ్యాపార ఉ ద్యోగాలలో అదనపు పని భారం వలన శ్రమ కలుగుతుంది.

**వృశ్చికం:** వ్యాపార పరంగా స్థిరమైన నిర్ణయాలు చేయలేరు. చేపట్టిన పనులలో ముందుకు సాగక చికాకులు పెరుగుతాయి. నూతన ఋణాలు చేయవలసి రావచ్చు. కావలసిన వారితో విభేదాలు కలుగుతాయి. వృత్తి, ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

**ధనస్సు:** చేపట్టిన పనులను విజయవంతంగా పూర్తిచేస్తారు. విందు వినోద కార్యక్రమాలకు కుటుంబ సభ్యులతో హాజరు అవుతారు. ఆర్థిక లాభాలు కలుగుతాయి. ఆలోచనలు కలసి వస్తాయి. నూతన వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగాలలో ఉ న్నతి కలుగుతుంది.

**మకరం:** దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యల నుండి ఉ పశమనం కలుగుతుంది. వృత్తి ఉద్యోగాలలో మీ ప్రాధాన్యత పెరుగుతుంది. నూతన వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు కలసి వస్తాయి. శు భకార్యాలకు ఆహ్వానాలు అందుతాయి. వాహన క్రయ విక్రయాలు లాభిస్తాయి.

**కుంభం:** ఋణ భారం పెరిగి నూతన ఋణాలు చేయవలసి వస్తుంది. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అవాంతరాలు కలుగుతాయి. బంధుమిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాల్లో వాహన ఇబ్బందులు ఉంటాయి. నూతన పెట్టుబడులు కలిసిరావు. ఉద్యోగాలలో విమర్శలు పెరుగుతాయి.

**మీనం:** ఆర్థిక విషయాలలో మిశ్రమ ఫలితాలుంటాయి. ఋణ ప్రయత్నాలు కలిసిరావు. దూరపు బంధువుల నుండి ఒక వార్త విచారం కలిగిస్తుంది. దూర ప్రయాణ సూచనలున్నవి. నిరుద్యోగులకు సామాన్యంగా ఉంటుంది. ఆరోగ్య విషయాలలో శ్రద్ధ తీసుకోవడం మంచిది.





# పటాకుల రక్తపాతం

తరువాయి 2 వ పేజీలో...

పడిపోయాయి. సమీపంలోని నివాసాలు కూడా ధ్వంసమయ్యాయి. ప్రమాద సమయంలో 30 మంది వరకూ బాణాసంచా తయారీ కేంద్రంలో పనిచేస్తున్నట్లు తెలిసింది. వీరిలో ఎక్కువగా మహిళలు ఉన్నట్లు సమాచారం. ఉదయం పని కోసం వెళ్లినవారు.. ఇలా విగత జీవులుగా పొలాలలో పడి ఉండటం చూసి వారి కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. పేలుడు శబ్దం సుమారు 5 కిలోమీటర్ల దూరం వరకూ వినిపించిందని స్థానికులు చెప్తున్నారు. శబ్దం తీవ్రతకు పక్కనే ఉన్న గ్రామంలో ఓ ప్రైవేటు పాఠశాలలో శ్లాబ్‌కు పగుళ్లు వచ్చినట్లు తెలిసింది. పరిమితికి మించి బాణసంచా తయారు చేయడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెప్తున్నారు. అటు.. అధికారులు డీఎన్‌ఏ టెస్టుల ఆధారంగా మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. డీఎన్‌ఏ రిపోర్టులు వచ్చిన తర్వాత మృతదేహాలను అప్పగిస్తామని తెలిపారు.

## మృతుల కుటుంబాలకు రూ.20 లక్షల సాయం: చంద్రబాబు

పేలుడు ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.20 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాల పిల్లల విద్య బాధ్యతను పూర్తిగా ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. వారి చదువు పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని ఖర్చులనూ భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు ఎంత ఖర్చయినా మెరుగైన వైద్యం అందిస్తామని తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. వైద్య సేవల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని సూచించారు.

## నిర్లక్ష్యం చేసిన అధికారుల సస్పెన్షన్

ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. ఆర్డీవో, డీఎస్పీ, అగ్నిమాపక శాఖాధికారి, కార్మిక శాఖ అధికారులను సస్పెండ్ చేసినట్లు చంద్రబాబు ప్రకటించారు. బాధ్యతల నిర్వహణలో విఫలమైన వారిపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. అటు.. ఈ ప్రమాదానికి కారణమైన బాణసంచా వ్యాపారులపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు అందజేస్తామని తెలిపారు. బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గత ఏడాది కొమరపాలెంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటన తర్వాత ప్రభుత్వం ఒక ప్రత్యేక పాలసీ రూపొందించినట్లు తెలిపారు. ఆ పాలసీని పూర్తిగా అమలు చేసి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## కేంద్రం తరపున రూ.2 లక్షలు

పేలుళ్ల ఘటనపై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఈ ఘటనపై పీఎం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. 'కాకినాడ జిల్లాలోని కర్మాగారంలో ప్రమాదవశాత్తు జరిగిన పేలుడులో ప్రాణనష్టం సంభవించడం చాలా బాధాకరం. ఈ క్లిష్ట సమయంలో బాధితులు, వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. ఈ ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ.50,000 ఎక్స్‌గ్రేషియా పీఎంఎన్ఆర్‌ఎఫ్ నుంచి అందజేస్తున్నాం' అని పేర్కొన్నారు. ఘటనపై కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా కూడా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# మిస్సైళ్ల విధ్వంసం

మొదటి పేజీ తరువాయి

ఆపరేషన్ ఇది. టెహ్రాన్ లో వరుస పేలుళ్లు సంభవిస్తోన్నాయి. దట్టమైన పొగలు ఆ నగరాన్ని ఆవరించాయి. ఎప్పుడేం జరుగుతుందో, ఎక్కడ ఏ బాంబు పడుతుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. ఊహించని ఈ ఘటనతో ఇరాన్ ఉలిక్కిపడింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్ డౌన్‌టౌన్‌లో భారీ పేలుడు జరిగి దట్టమైన పొగ అలముకుంది. పలు చోట్ల పేలుడు శబ్దాలు వినిపించాయి. తొలుత టెహ్రాన్‌లో మూడు వరుస పేలుళ్లు సంభవించాయి. ఆ వెంటనే నగర శివార్లతో పాటు అంతర్జాతీయ విమానాశ్రయం సమీప ప్రాంతాలు బాంబుల మోతలతో మార్మోగిపోయాయి. దీని తర్వాత టెహ్రాన్‌లో మరో రెండు చోట్ల బాంబులు పేలినట్లు లోకల్ మీడియా తస్నీమ్ వెల్లడించింది. దీంతోపాటు యూనివర్శిటీ స్ట్రీట్, జోమ్‌హౌరి ప్రాంతాన్ని అనేక క్షిపణులు ఛిన్నాభిన్నం చేశాయి. హార్మోజ్‌గాన్ ప్రావిన్స్ మినాబ్ నగరంలోని ఓ బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 85 మంది మృతి చెందినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరో 45 మంది గాయపడినట్లు తెలిపింది. దాడి సమయంలో స్కూల్‌లో 170 మంది విద్యార్థినులు ఉన్నారని, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇరాన్ పారామిలిటరీ 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్'కు ఈ ప్రాంతంలో స్థావరం ఉంది.




## తీవ్రంగా ప్రతిఘటించిన ఇరాన్

ఈ దాడితో రగిలిపోయిన ఇరాన్.. ప్రతీకార దాడులు చేపట్టింది. పశ్చిమాసియాలోని అమెరికా నౌకా, సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంది. ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఖతార్, బహ్రెయిన్, జోర్డాన్, ఇరాక్ సహా ఎనిమిది దేశాలపై ఏకకాలంలో ఇరాన్ క్షిపణులతో విరుచుకుపడింది. కువైట్ ఎయిర్ పోర్ట్ పై డ్రోన్ తో దాడి చేసింది. దీంతో ఎయిర్ పోర్టు తుక్కుతుక్కయింది. ఒక్కసారిగా డ్రోన్ పడటంతో విమానాశ్రయం చాలా భాగం కూలిపోయింది. భారీ శబ్దంతో డ్రోన్ పేలడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. బహ్రెయిన్‌లోని మనామాలో ఉన్న అమెరికా నేవీ ఫిఫ్త్ ఫ్లీట్‌పై మిస్సైల్ దాడితో ఎమర్జెన్సీ సైరెన్లు మోగించారు. ప్రజల మొబైల్ ఫోన్లకు భద్రతా సందేశాలు వచ్చాయి. అలాగే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ రాజధాని అబుదాబిలోనూ పేలుళ్లు చోటుచేసుకున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి. మరోవైపు, రెండు ఇరాన్ క్షిపణులను అడ్డుకుని ఖతార్ కూల్చివేసినట్లు నివేదికలు తెలిపాయి. అల్ ఉదీద్ వైమానిక స్థావరంపై దాడిచేసినప్పటికీ అక్కడ అమెరికాకు చెందిన ఎటువంటి సామాగ్రి లేదు. ఇజ్రాయెల్ కూడా తమపై ఇరాన్ క్షిపణులను ప్రయోగించినట్లు ధ్రువీకరించింది. 'గగనతల రక్షణ వ్యవస్థ ప్రస్తుతం క్షిపణులను గుర్తించి అడ్డుకుంటోంది.. ఇరాన్ నుంచి ఇజ్రాయెల్ వైపు ప్రయోగించిన క్షిపణులను గుర్తించిన తర్వాత దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో సైరన్లు మోగించాం. ఈ సమయంలో, ముప్పును నివారించడానికి ఐఏఎఫ్ పనిచేస్తోంది' అని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది.

పరిస్థితిని నిరంతరం గమనిస్తూ ఉ ఒటామని, సమాచారం ఎప్పటికప్పుడు అందజేస్తామని తెలిపింది. అటు, ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన భవనం బూర్జ్ ఖలీఫాను సైతం ఖాళీ చేయించారు. ఇరాన్ భీకర దాడులతో దుబాయ్ నగరవ్యాప్తంగా పేలుళ్ల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే బూర్జ్ ఖలీఫాను మూసివేసినట్టు అధికారులు తెలిపారు.

## ఇరాన్ రక్షణ మంత్రి మృతి

ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా శనివారంనాడు చేపట్టిన దాడుల్లో ఇరాన్ రక్షణ మంత్రి అమీర్ నాసిర్జాదే మృతి చెందినట్టు తెలుస్తోంది. ఇజ్రాయెల్ మిటలరీ ఆపరేషన్స్ వర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. అయితే దీనిపై ఇరాన్ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇదే దాడుల్లో ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కమాండర్ మహమ్మద్ పాక్పూర్ కూడా మరణించినట్టు మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్ వర్గాలు ఈ విషయాన్ని ధ్రువీకరించాయి.

## భారతీయులకు కేంద్రం అడ్వైజరీలు

ఇజ్రాయెల్, ఇరాన్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని భారత పౌరులకు కేంద్రం అడ్వైజరీ జారీచేసింది. ఇజ్రాయెల్, ఇరాన్‌లో ఉండే భారత పౌరులు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించింది. భారతీయులు అత్యంత జాగ్రత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలను పాటించాలని ఈ మేరకు యూఏఈ, సౌదీ, జోర్డాన్ సహా గల్ఫ్ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు ప్రకటన జారీ చేశాయి. 'ఈ ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల దృష్ట్యా ఇజ్రాయెల్‌లోని భారతీయులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. ఇజ్రాయెల్ జారీ చేసే భద్రతా మార్గదర్శకాలను పాటించాలి. అనవసర ప్రయాణాలు రద్దుచేసుకుని, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి.. ఎప్పటికప్పుడు స్థానిక మీడియా, ఎమర్జెన్సీ అలర్ట్‌లను గమనించాలి. అత్యవసర పరిస్థితుల్లో టెల్‌అవీవ్ భారత ఎంబసీ సంప్రదించాలి' అని ట్వీట్ చేసింది.

# అన్ని ఆలయాల్లో 'విరోష్' అన్నదానం

మొదటి పేజీ తరువాయి

మీడియా ద్వారా పంచుకున్న విజయ్, రష్మిక.. 'మీరందరూ ఎప్పుడూ మా ప్రయాణంలో, మా ప్రేమలో భాగమే. మన దేశంలో ఏ శుభకార్యమైనా భోజనం, మిఠాయిలతోనే జరుపుకుంటాం. అందుకే ఈ ఆనంద సమయంలో మీ అందరి ఆశీర్వాదాలు కోరుతూ స్వీట్లు పంచుతున్నాం' అని పేర్కొన్నారు. హైదరాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్, వైజాగ్, విజయవాడ, పుట్టపర్తితో పాటు ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు వంటి ప్రధాన నగరాల్లో ఈ స్వీట్ల పంపిణీ జరగనుంది. మరోవైపు, విరోష్ వివాహాన్ని పురస్కరించుకుని వీరిద్దరూ జంటగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబలి' నుంచి 'ఏందయ్యా సామి' అనే పెళ్లి పాట గ్లింప్స్‌ను చిత్రబృందం శనివారం విడుదల చేసింది. 1850ల నాటి వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో విజయ్ 'రణబలి' పాత్రలో, రష్మిక ఆయన భార్య 'జాయమ్మ'గా కనిపించనున్నారు. హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ (ది మమ్మీ ఫేమ్) ఇందులో విలన్ సర్ థియోడర్ హెక్టర్‌గా నటిస్తున్నారు. గీత గోవిందం, డియర్ కామ్రేడ్ తర్వాత ఈ సినిమాలో నటిస్తున్నారు. పెళ్లి తర్వాత వీరిద్దరూ జంటగా వెండితెరపై కనిపించబోయే తొలి సినిమా ఇదే.

# హరీశ్ రావు ఎఫెక్ట్!

మొదటి పేజీ తరువాయి

సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు హరీశ్ రావు . నిత్య అన్నదానం, వేద పాఠశాల, గోశాల, అమ్మవారి ఆలయం, ఇవన్నీ ఉండటం నీకు ఇష్టం లేదా రేవంత్ అని ప్రశ్నించారు. కేసీఆర్ ఆనవాళ్ళు మారుస్తాను అంటే ఆఖరికి కేసీఆర్ కట్టిన గుడులు కూడా కూలుస్తారా అని నిలదీశారు. కూల్చడమేనా సీఎం రేవంత్ పాలన అని మండిపడ్డారు. హరీశ్ రాకతో ఆలయం దగ్గరకు రెవెన్యూ, పోలీసు అధికారులు భారీగా చేరుకున్నారు. కాసేపు అక్కడ ఉద్రిక్తత నెలకొంది.

# రేవంత్ కరెక్షన్..!

మొదటి పేజీ తరువాయి

సచివాలయంలో వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 99 రోజుల యాక్షన్ ప్లాన్‌పై సమావేశంలో అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. మార్చి నుంచి జూన్ వరకు 99 రోజుల యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు.

# రేపు తెలంగాణకు రాహుల్

మొదటి పేజీ తరువాయి

విడుదల చేసింది. మార్చి 2న ఉదయం 7.10కి రాహుల్ గాంధీ ఢిల్లీ ఎయిర్‌పోర్టు నుంచి ఎయిరిండియా విమానంలో బయలుదేరుతారు. ఉదయం 9:20కి హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం10 గంటలకు ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా వికారాబాద్‌కు బయలుదేరుతారు 10.30 నుంచి సాయంత్రం 4.30 వరకు వికారాబాద్‌లోని అనంతగిరి హరిత రిసార్ట్స్‌లో జరిగే డీసీసీ అధ్యక్షుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై నాయకులకు దిశానిర్దేశం చేయనున్నారు. సాయంత్రం 4.30కి శిక్షణ ముగిసిన అనంతరం వికారాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా తిరిగి హైదరాబాద్‌కు చేరుకుంటారు. సాయంత్రం 5.30కి శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఎయిరిండియా విమానంలో ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు. రాహుల్‌గాంధీ పర్యటన దృష్ట్యా తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు వికారాబాద్‌లో భారీ ఏర్పాట్లు చేస్తున్నాయి. పర్యటన పొడవునా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించింది.

# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ షురూ

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేసింది. నివారణ ఆరోగ్య సంరక్షణకు తమ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతకు ఈ కార్యక్రమం నిదర్శనమని పేర్కొంది. రాజస్థాన్ పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. కిషన్‌గఢ్ విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, గవర్నర్ స్వాగతం పలికారు. ఈ పర్యటనలో జైపూర్–బండికుయ్ ఎక్స్‌ప్రెస్‌వే, అమృత్‌సర్–జామ్‌నగర్ ఎకనామిక్ కారిడార్‌లోని ఓ భాగాన్ని ఆయన ప్రారంభించారు. అలాగే జోధ్‌పూర్‌లో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మించనున్న నాలుగు లేన్ల ఎలివేటెడ్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. వీటితో పాటు 'ప్రతి ఇంటికి నీరు' పథకంలో భాగంగా తాగునీటి ప్రాజెక్టులకు, పునరుత్పాదక ఇంధన రంగంలో భాగంగా విద్యుత్ సరఫరా వ్యవస్థ, గ్రిడ్ సబ్–స్టేషన్లకు కూడా ఆయన శంకుస్థాపనలు చేశారు. రాష్ట్రంలో 'రోజ్‌గార్ ఉత్సవ్' కింద కొత్తగా ఎంపికైన 21,800 మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.

# పల్లె 'కళ'కు పనిముట్లు!

## గ్రామీణ కళాకారులకు యంత్రాలు, కిట్లు.. అందజేసిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**గ్రామోద్యోగ వికాస్ యోజన కింద 530 మందికి లబ్ధి**

సికింద్రాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): సంప్రదాయ గ్రామీణ వృత్తుల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'గ్రామోద్యోగ వికాస్ యోజన' ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. గ్రామీణ పరిశ్రమల అభివృద్ధితో స్థానికంగా స్థిరమైన ఉపాధి పెరుగుతుందని, వలసలు తగ్గుతాయని చెప్పారు. శనివారం సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ సర్కిల్ సమీపంలోని క్లాసిక్ గార్డెన్స్‌లో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్ (కేవీఐసీ) నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 530 మంది కళాకారులకు యంత్రాలు, టూల్ కిట్లు అందజేశారు. చెప్పుల తయారీ, మట్టి పనులు, కుట్టు, అగరబత్తి తయారీ, మొబైల్ రిపేరింగ్, చెక్క పనులు, గ్రామీణ నూనె ఉత్పత్తి రంగాలకు సంబంధించిన 496 పరికరాలు పంపిణీ చేశారు. అలాగే, ప్రధాన మంత్రి ఉపాధి సృష్టి కార్యక్రమం కింద ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. 'ఖాదీ ఫర్ నేషన్, ఖాదీ ఫర్ ఫ్యాషన్, ఖాదీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్' భావనతో స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలని సూచించారు. కుట్టు యంత్రాలు పొందిన మహిళలు తమ కార్యకలాపాలను విస్తరించి మరింత ఉపాధి సృష్టించాలని పిలుపునిచ్చారు. కేవీఐసీ చైర్మన్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ సాంకేతిక సహాయం, ఆర్థిక మద్దతు, మార్కెట్ అవకాశాల ద్వారా గ్రామీణ వృత్తులు స్థిరమైన వ్యాపారాలుగా మారుతున్నాయని చెప్పారు. నాణ్యత, మెరుగైన ప్రదర్శన, మార్కెట్ దృష్టితో ఉత్పత్తులు తయారు చేస్తే జాతీయ స్థాయిలో పోటీలో ఉంటామని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాదీ సంస్థల ప్రతినిధులు, లబ్ధిదారులు, తెలంగాణ ప్రభుత్వ, కేవీఐసీ అధికారులు పాల్గొన్నారు.

**మూడేళ్లలో 1,720 లబ్ధిదారులకు ఆసరా**

తెలంగాణలో గత మూడు సంవత్సరాల్లో గ్రామోద్యోగ కార్యక్రమాల కింద 1,720 మంది కళాకారులకు రూ.3.59 కోట్లతో 1,790 యంత్రాలు, టూల్‌కిట్లు పంపిణీ చేశారు. పీఎంఈజీపీ కింద రూ.285.08 కోట్ల మార్జిన్ మనీతో 6,501 యూనిట్లు స్థాపించి 64,002 మందికి ఉపాధి కల్పించారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 2,148 ప్రాజెక్టుల ద్వారా 23,628 ఉపాధి అవకాశాలు సృష్టించాలని లక్ష్యం పెట్టుకోగా 96 శాతం టార్గెట్ పూర్తయ్యింది. రాష్ట్రంలో వర్క్‌షెడ్లు, విక్రయ కేంద్రాల నవీకరణ, వనపర్తి జరీ-జర్దోసీ క్లస్టర్ అభివృద్ధి, విలువ ఆధారిత మిల్లెట్ ఉత్పత్తుల సాంకేతిక ప్రాజెక్టులకు కేవీఐసీ మద్దతు అందిస్తోంది.

# మార్చి 6 నుంచి యాక్షన్ ప్లాన్!

## రాష్ట్రమంతటా 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం... గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్లాన్

**జూన్ 2న వేడుకలా జరుపుకోవాలి**

**పౌర సేవలను సులభతరం చేసే సంస్కరణలు**

**సీనియర్ ఐఏఎస్ అధ్వర్యంలో కమిటీ**

**కార్యదర్శుల సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి**



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు.. అభివృద్ధి పనులు, ప్రజోపయోగ కార్యక్రమాలను రాష్ట్ర ప్రజలకు మరింత చేరువ చేయాలనే సంకల్పంతో రాష్ట్రంలో 'ప్రజా పాలనబి ప్రగతి ప్రణాళిక' కార్యక్రమం చేపడుతున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. రాష్ట్రంలో మార్చి 6వ తేదీ నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు ఈ ప్రణాళికను అమలు చేయాలని అన్ని శాఖల కార్యదర్శులు, ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజల పండుగ.. జూన్2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సంబురంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకను పురస్కరించుకొని 99 రోజుల పాటు జరిగే 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వర్తించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ స్థాయి నుంచి మండలస్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి వరకు షెడ్యూలు ప్రకారం కార్యక్రమాలను విజయవంతం చేయాలని, అందుకు అవసరమైన ప్రణాళికను వెంటనే సిద్ధం చేసి ఆచరణలో చూపెట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక లోగో తయారు చేయాలని, రాష్ట్రమంతటా 99 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాలను షెడ్యూలును రూపొందించాలని సీఎస్ ను ఆదేశించారు. ఫైళ్లలో ఉన్న నిర్ణయాలు క్షేత్రస్థాయిలో ఫలితాలుగా మారాలని, ప్రజలకు పథకాల ప్రయోజనం ప్రత్యక్షంగా చేరేలా యంత్రాంగం మొత్తం ఒకే లక్ష్యంతో పనిచేయాలని సీఎం సూచించారు. ఈ 99 రోజుల్లో ఫైళ్ల క్లియరెన్స్ తో పాటు అన్ని విభాగాలు, రాష్ట్ర స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు అన్ని ఆఫీసుల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించాలని సూచించారు. పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ తో పాటు ప్రతి శాఖ, ప్రతి జిల్లా, ప్రతి అధికారి మిషన్ మోడ్‌లో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. శనివారం సాయంత్రం అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. సీఎస్ రామకృష్ణారావు, డీపీజీ శివధర్ రెడ్డితో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, సీఎంవో అధికారులు, అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. వచ్చే 99 రోజులు అత్యంత కీలకమని, ప్రతి రోజును అమూల్యంగా భావించాలని అధికారులపై ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడకుండా పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. 99 రోజుల కార్యక్రమ పురోగతిని వ్యక్తిగతంగా పరిశీలిస్తానని, క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహిస్తానని సీఎం తెలిపారు. అధికారుల పనితీరు లోపాలను సహించబోమని హెచ్చరించారు. ఐఏఎస్ అధికారులే ప్రభుత్వానికి వెన్నెముక అని, ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం.. అమల్లోకి తెచ్చిన ప్రతి పాలసీ విజయం, వైఫల్యాలన్నీ మీపైనే ఉన్నాయని అన్నారు. శాఖల మధ్య సమన్వయం కీలకమని, ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం విజయవంతం కావాలంటే విభాగాల మధ్య అడ్డంకులు తొలిగిపోవాలని అన్నారు.

**సాంకేతిక సంస్కరణలపై కమిటీ**

పరిపాలనలో అధునాతన సాంకేతిక నైపుణ్యాన్ని సమర్థంగా వినియోగించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పౌరులకు అవసరమైన సేవలన్నింటినీ మరింత సులభతరం చేయాలని స్పష్టం చేశారు. ఇంటి నుంచే ఆన్ లైన్ ద్వారానే అన్ని సేవలు పొందేలా సాంకేతిక సంస్కరణలు తీసుకురావాలని ఆదేశించారు. కరెంట్ మీటర్, తమ ఇంటి అనుమతి, నల్లా కనెక్షన్ మొదలు ప్రభుత్వం నుంచి పొందాల్సిన అనుమతులకు, సేవలకు ప్రజలు ఆఫీసులకు రావాల్సిన అవసరం లేకుండా పనులు జరగాలని అన్నారు. వాహనం కొన్న షోరూమ్లోనే రిజిస్ట్రేషన్ జరిగే విధానం అమల్లోకి వచ్చిందని, ఇలా ప్రతి విభాగంలోనూ సంస్కరణలు తీసుకురావాలని చెప్పారు. ఏ ఫైలు, ఏ అర్జీ ఎక్కడ ఉందో దరఖాస్తుదారు తెలుసుకునే సునాయస విధానం ఉండాలని సూచించారు. సమూల మార్పులతో సాంకేతిక సంస్కరణలు అమలు చేసేందుకు సీనియర్ ఐఏఎస్ జయేష్ రంజన్ అధ్వర్యంలో ప్రత్యేక కమిటీ వేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. మూడు వారాల్లో కమిటీ తమ నివేదికను అందజేయాలని చెప్పారు. ప్రతి విభాగం ఈ ఆఫీస్ విధానం, డిజిటల్ గవర్నెన్సు అమలు చేయాలని, అన్ని శాఖలకు సంబంధించిన డేటా నిల్వ చేస్తున్న పాత కాలం సర్వర్‌లను రాబోయే 20 సంవత్సరాలకు సరిపడేలా అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. సంక్షేమ పథకాలు పకడ్బందీగా అమలు చేయాలని, ఇందులోనూ సాంకేతికత ను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. మహాలక్ష్మి, రేషన్ కార్డులు, రూ.500 గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు, ఆరోగ్య శ్రీ అర్హులైన వారందరికీ చేరాలని, సొంత స్థలముండి ఇల్లు లేని వారందరికీ ఇందిరమ్మ ఇళ్ల లబ్ధి అందించాలన్నారు. రేషన్ కార్డులు అప్లై చేసుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగాలన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా నాణ్యమైన విద్య ను అందించేలా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో వంద మండలాల్లో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ విద్యను ప్రక్షాళన చేయటంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సేవలను మెరుగుపరిచే విధానాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి ఐఏఎస్ అధికారి తమ శాఖలో బెస్ట్ ప్రోగ్రామ్ ను డిజైన్ చేసుకోవాలని, తమంతట తాముగా గర్వపడే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. చేసినంత మాత్రాన సరిపోదని, ప్రజలకు చెప్పుకోవాల్సిన బాధ్యత కూడా అధికారులపై ఉందన్నారు. ప్రభుత్వ పథకాలు, హామీలు ప్రజలకు మరింత చేరువ కావాల్సిన అవసరం ఉందన్నారు. దేశ అభివృద్ధి పథంలోనూ, పరిపాలనలోనూ తెలంగాణను తిరుగులేని ఆదర్శ రాష్ట్రంగా నిలబెట్టాలనే లక్ష్యంతో పని చేయాలని అన్నారు. తెలంగాణ రైజింగ్ విజన్లో భాగంగా ప్రభుత్వం రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ మూడు జోన్లుగా విభజించి దేశంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను నిలబెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. కోర్ అర్బన్ రీజియన్ లో చేపట్టాల్సిన సర్వీస్ సెక్టార్ అభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకోవాలని అన్నారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు.. ఉన్న పెరీ అర్బన్ రీజియన్ ఎకానమీకి అవసరమైన మాన్యుఫాక్చరింగ్ జోన్ భవిష్యత్తులోనూ కీలకంగా మారుతుందన్నారు. దాదాపు 10 వేల చదరపు కిలో మీటర్ల పరిధిలో విస్తరించే మాన్యుఫాక్చరింగ్ రంగం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందన్నారు. సేవా రంగం, తయారీ రంగంలో వస్తున్న పెను మార్పులు గమనంలోకి తీసుకోవాలని, శాఖలపైన ప్రతి ఒక్కరికి సంపూర్ణ అవగాహన ఉండాలని అధికారలను అప్రమత్తం చేశారు. అన్ని విభాగాల్లో పని చేస్తున్న రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల డేటా కార్యదర్శుల వద్ద సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్రంలో మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండడానికి వీలు లేదని ఆదేశించారు. ప్రతి శాఖకు సొంత భవనం ఉండాలి..బడ్జెట్ ప్రతిపాదన లో వీటిని చేర్చాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులను రాబట్టుకునేందుకు ప్రతి శాఖ అప్రమత్తంగా ఉండాలని, నిధుల సద్వినియోగం చేపట్టడం వల్ల ప్రత్యేక రాయితీలు, ప్రోత్సాహకాలు కూడా రాష్ట్రం సాధించుకునే అవకాశం ఉంటుందని గుర్తు చేశారు. హైదరాబాద్లో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్తో పాటు వరల్డ్ ఎకనమిక్ ఫోరం, విదేశీ పర్యటనలతో రాష్ట్రానికి దాదాపు రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఈ ఎంవోయూలన్నీ ఫలవంతమయ్యేలా కార్యదర్శులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, అవి గ్రౌండయ్యేంత వరకు సంప్రదింపులు జరపాలని ఆదేశించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ ద్వారా ఈ పెట్టుబడులన్నీ సాకారమైతే తెలంగాణ పారిశ్రామిక రంగం ఆశించిన లక్ష్యం నెరవేరుతుందన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం, అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఫ్యూచర్ సిటీ దేశ ఆర్థిక స్థితిని మార్చబోతుందన్నారు.

### 'మక్కా' ప్రమాద మృతుల కుటుంబాలకు పరిహారం

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): గత సంవత్సరం నవంబర్‌లో మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిహారం పంపిణీ చేశారు. 44 మంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేశారు. ఈ బస్సు ప్రమాదంలో గాయపడినవారికి రూ.3 లక్షల చొప్పున సాయం అందించారు. గత సంవత్సరం నవంబర్ 17న మక్కా యాత్రలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మక్కా నుంచి బయలుదేరిన బస్సు ముందు వెళుతున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి ప్రమాదం జరిగింది.

# వికారాబాద్‌లో మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య

వికారాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఓ మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. పట్టణంలోని గంగారాం సాయి బాబా కాలనీలో నివాసం ఉంటున్న బలిజ దివ్య (27) ఇవాళ తెల్లవారుజామున ఇంట్లో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. వివరాల్లోకి వెళితే... బలిజ దివ్య కోటపల్లి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆమె ధరూర్ సీఐ కార్యాలయానికి అటాచ్‌గా పనిచేస్తున్నారు. శనివారం తెల్లవారుజామున ఆమె ఉరివేసుకుని ఉండటాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వికారాబాద్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ దివ్య ఆత్మహత్యకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాల వల్ల ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారా? లేక విధి నిర్వహణలో ఏమైనా ఒత్తిళ్లు ఉన్నాయా? అనే కోణాల్లో పోలీసులు విచారణ జరుపుతున్నారు. పూర్తి దర్యాప్తు తర్వాత మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉంది.

# నిర్మాణ రంగం అంటే రాష్ట్ర, దేశ నిర్మాణం

**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): నిర్మాణ రంగం అంటే కేవలం కాంట్రాక్టు కాదని, అది రాష్ట్ర, దేశ నిర్మాణమని తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ మేనేజింగ్ కమిటీ అండ్ జనరల్ కౌన్సిల్ మీటింగ్-2025-26 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. రోడ్లు, భవనాల నిర్మాణంలో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో వేగవంతమైన అభివృద్ధి లక్ష్యంగా విజన్ 2047 లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. అభివృద్ధికి నిర్మాణ రంగం కీలకమని అన్నారు. ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బిల్డర్లకు మంత్రి సూచించారు. ప్రభుత్వాలు ప్రణాళికలు వేస్తాయి, బడ్జెట్ కేటాయిస్తాయి, ప్రాజెక్టులను ప్రకటిస్తాయని కానీ ఆ ప్రణాళికలకు ప్రాణం పోసేది మాత్రం బిల్డర్లేనని అన్నారు. బిల్డర్లు వేసే రోడ్లు ప్రజల ప్రయాణాన్ని సులభం చేస్తాయని, వంతెనలు దూరాన్ని తగ్గిస్తాయని అన్నారు. బిల్డర్లు కట్టే భవనాలు సేవలకు నిలయాలు అవుతాయని అన్నారు. అందుకే నిర్మాణ రంగం అంటే తన వరకు కేవలం కాంట్రాక్టు కాదని, దేశ, రాష్ట్ర నిర్మాణమని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి పునాది మౌలిక వసతులేనని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. రోడ్లు బాగుంటేనే పెట్టుబడులు వస్తాయని, కనెక్టివిటీ బాగుంటేనే పరిశ్రమలు వస్తాయని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం సుమారు లక్ష కోట్ల రూపాయల విలువైన పనులు రాష్ట్రంలో కొనసాగుతున్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రకాల పనులు జరుగుతున్నాయని అన్నారు. ప్రత్యేకంగా రీజినల్ రింగ్ రోడ్డు తెలంగాణ భవిష్యత్తును మార్చే ప్రాజెక్టు అన్నారు. ఈ ప్రాజెక్టు హైదరాబాద్ చుట్టూ ట్రాఫిక్ భారాన్ని తగ్గించడమే కాదని, చుట్టుపక్కల జిల్లాల్లో అభివృద్ధికి మార్గాలు వేస్తుందని అన్నారు. ఇది ఆర్థిక కారిడార్లకు దారి తీస్తుందని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు.

# లండన్‌లో నిజామాబాద్ యువకుడు మృతి

నిజామాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లిన ఇద్దరు తెలుగు విద్యార్థుల జీవితాలు అగ్నిప్రమాదంలో అర్థాంతరంగా ముగిసిపోయాయి. ఈ నెల 23న జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే చనిపోగా.. తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చేరిన మరో యువకుడు శుక్రవారం రాత్రి మరణించాడు. ఈ ప్రమాదంలో గాయపడ్డ మరో యువకుడు ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గంటి అభిషేక్ (28), నిజామాబాద్ జిల్లాకు చెందిన కామినేని సాయి శ్రీకర్ (26), మరో యువకుడు.. ముగ్గురూ ఉన్నత విద్యాభ్యాసం కోసం లండన్ వెళ్లారు. చదువు పూర్తిచేసుకుని ఉద్యోగంలో చేరారు. దక్షిణ లండన్ లోని క్రోయ్డన్ ప్రాంతంలోని రెండంతస్తుల భవనంలో ముగ్గురూ కలిసి అద్దెకు ఉంటున్నారు. ఈ నెల 23న భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఇల్లంతా మంటలు, పొగ వ్యాపించడంతో ఊపిరాడక అభిషేక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్ర గాయాలపాలైన మిగతా ఇద్దరిని అత్యవసర సేవల సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. శ్రీకర్ ను పరీక్షించిన వైద్యులు.. అతడిని బ్రెయిన్ డెడ్ గా నిర్ధారించారు. మూడు రోజుల పాటు మృత్యువుతో పోరాడిన శ్రీకర్.. శుక్రవారం కన్నుమూశారు. మరో యువకుడు ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కొడుకు దూరమైనా, శ్రీకర్ తల్లిదండ్రులు (అంజనేయ ప్రసాద్, రేణుక) ఒక గొప్ప నిర్ణయం తీసుకున్నారు. తన కొడుకు మరో నలుగురికి ప్రాణదానం చేయాలని భావించి అవయవ దానానికి అంగీకరించారు. శ్రీకర్ అవయవాల సేకరణ ప్రక్రియ పూర్తయిందని, ఇప్పుడు తమ బిడ్డ మృతదేహాన్ని వీలైనంత త్వరగా నిజామాబాద్‌కు పంపాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# ఐఏఎస్ అర్వింద్‌పై వేటు?

**పోస్టింగ్ ఇవ్వకుండా బదిలీ!**

హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): ఫార్ములా ఈ రేసు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు తీసుకుంది. రాష్ట్ర రెవెన్యూ (విపత్తు నిర్వహణ) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఆయనను బదిలీ చేస్తూ, ఎక్కడా కొత్త పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచింది. రాష్ట్రంలో 45 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం రాత్రి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో ఈ విషయం వెల్లడైంది. ఈ క్రమంలో ఆయనను సస్పెండ్ చేస్తూ ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. సంబంధిత దస్త్రంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం చేశారని, నేడో రేపో ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఫార్ములా ఈ రేసు నిర్వహణలో ఆర్థిక అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో అర్వింద్ కుమార్‌ను ప్రాసిక్యూట్ చేసేందుకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ (డీఓపీటీ) ఫిబ్రవరి మధ్యలో అనుమతినిచ్చింది. ఈ అనుమతి లభించిన కొన్ని రోజులకే రాష్ట్ర ప్రభుత్వం ఆయనపై బదిలీ వేటు వేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఏడాదిలో వరంగల్ ఎయిర్‌పోర్టు సేవలు!

**కేంద్ర పరిశీలనలో డీపీఆర్.. త్వరలో ఆమోదం**

**3 కిలోమీటర్ల మేర రన్‌వే.. ఆధునిక టెర్మినల్, కార్గో నిర్మాణం**



వరంగల్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): తెలంగాణలో విమానయాన రంగం విస్తరణకు మార్గం సుగమం అవుతోంది. రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరమైన వరంగల్‌లో విమానాశ్రయం ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ఉన్న మామునూరు ఎయిర్‌స్ట్రిప్‌ను పూర్తిస్థాయి వాణిజ్య విమానాశ్రయంగా మార్చి, ఏడాదిలోగా సేవలు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. త్వరలోనే దీనికి ఆమోదముద్ర లభించవచ్చని అధికారులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన వెంటనే పనులు ప్రారంభించి, ఏడాదిలో పూర్తి చేయాలని ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) ప్రణాళికలు రచిస్తోంది. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి సంస్థల పెద్ద విమానాలు కూడా సులభంగా ల్యాండ్ అయ్యేందుకు వీలుగా రన్‌వేను 3 కిలోమీటర్ల మేర విస్తరించనున్నారు. దీంతో పాటు అంతర్జాతీయ ప్రమాణాలతో ప్యాసింజర్ టెర్మినల్, కార్గో సదుపాయం, పటిష్ఠమైన భద్రతా వ్యవస్థలు, విశాలమైన పార్కింగ్ వంటివి నిర్మించనున్నారు. ఈ విమానాశ్రయ అభివృద్ధికి అవసరమైన భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసింది. సుమారు 950 ఎకరాల భూమిని కేటాయించగా, అదనంగా మరో 253 ఎకరాలను సేకరించి ఏఏఐకి అప్పగించింది. ప్రస్తుతం తెలంగాణలో పౌర విమానయాన సేవలు శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి మాత్రమే పరిమితమయ్యాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఎయిర్ కనెక్టివిటీని పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మామునూరుతో పాటు రామగుండం, పెద్దపల్లి, కొత్తగూడెంలలో కూడా విమానాశ్రయాలను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించింది. మామునూరు ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే వరంగల్ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. విమాన సేవలు ప్రారంభమైతే పారిశ్రామిక, ఐటీ సంస్థలు ఈ ప్రాంతానికి తరలివచ్చేందుకు ఆసక్తి చూపుతాయి. అదేవిధంగా రామప్ప ఆలయం, వేయి స్తంభాల గుడి, వరంగల్ కోట వంటి చారిత్రక ప్రదేశాలకు దేశ, విదేశీ పర్యాటకుల రాక కూడా గణనీయంగా పెరుగుతుంది. తొలినాళ్లలో హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై వంటి ప్రధాన నగరాలకు చిన్న, మధ్యస్థాయి విమానాలతో సర్వీసులు నడిపే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఓరుగల్లు ప్రాంతం ఆర్థికంగా, పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందడం ఖాయమని భావిస్తున్నారు.

# రాజ్యసభ సీటు నాకే!

**రేవంత్, అధిష్ఠానంపై విశ్వాసం ఉంది**

**వీ హనుమంతరావు ఆశాభావం**



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): తనకు రాజ్యసభ అవకాశం కల్పించే విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ అధిష్ఠానం మీద పూర్తి విశ్వాసం ఉందని తెలంగాణ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వి హనుమంతరావు అన్నారు. తెలంగాణలో రెండు రాజ్యసభ స్థానాలు ఖాళీ కానుండగా, వాటి కోసం పలువురు రేసులో ఉన్నారు. ఈ నేపథ్యంలో వీహెచ్ కూడా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పార్టీలో తన పనితీరును చూసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తప్పకుండా అవకాశం ఇవ్వాలని కోరారు. పార్టీలో పని చేసిన వారికే పదవులు దక్కుతాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల వికారాబాద్‌లో జరిగిన డీసీసీ శిక్షణ తరగతుల్లో చెప్పారని గుర్తుచేశారు. ఈరోజు వరకు పార్టీ కోసం పనిచేస్తూనే ఉన్నానని, అందుకే రాజ్యసభ అవకాశం ఇవ్వాలని కోరుతున్నానని అన్నారు. పార్టీ కోసం తన పోరాట సామర్థ్యాలను చూసి అవకాశం ఇస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో అందరికంటే ఎక్కువగా తనమీద కేసులు నమోదయ్యాయని అన్నారు. అయినప్పటికీ తాను భయపడటం లేదని తెలిపారు.



జగిత్యాల జిల్లాలోని ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. కలెక్టర్ సత్య ప్రసాద్ దంపతులు హాజరై పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

- ధర్మపురి, ఈవార్తలు ప్రతినిధి



యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి అష్టోత్తర శతఘటాభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

- యాదగిరిగుట్ట, ఈవార్తలు ప్రతినిధి



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి సాలకట్ల తెప్పోత్సవాల్లో భాగంగా.. శనివారం రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారు పుష్కరిణిలో తెప్పపై విహరించి భక్తులకు కనువిందు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

- తిరుమల, ఈవార్తలు ప్రతినిధి

# వార్ జోన్‌లో 80 లక్షల మంది భారతీయులు

టెహ్రాన్: పశ్చిమాసియా దేశాల్లోని ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య రాజుకున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న లక్షలాది మంది భారతీయుల పాలిట పెను శాపంగా మారాయి. ప్రపంచంలోనే అత్యధికంగా 80 లక్షల మందికి పైగా భారతీయులు ఉపాధి, వ్యాపారం కోసం యూఏఈ, సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, ఒమన్ వంటి దేశాల్లో నివసిస్తున్నారు. ఇప్పుడు ఈ ప్రాంత మంతా 'వార్ జోన్' గా మారడంతో, అక్కడ ఉన్న భారతీయుల ప్రాణాలకు తీవ్ర ముప్పు పొంచి ఉంది. ముఖ్యంగా దుబాయ్‌లోని పామ్ జుమ్మెరా వంటి కీలక ప్రాంతాలపై క్షిపణి శకలాలు పడటం, గగనతలంలో క్షిపణుల గర్జనలు వినిపిస్తుండటంతో ప్రవాస భారతీయులు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని బిక్కుబిక్కుమంటున్నారు. చాలా మంది తమ నివాసాలను వదిలి సురక్షితమైన ప్రాంతాలకు తరలి వెళ్తున్నారు. ఈ యుద్ధం కారణంగా అంతర్జాతీయ విమానయాన రంగం పూర్తిగా స్తంభించిపోయింది. ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే దుబాయ్, అబుదాబి విమానాశ్రయాలను మూసివేయడంతో వేలాది మంది భారతీయ ప్రయాణికులు ఎయిర్ పోర్టుల్లోనే చిక్కుకుపోయారు. కేవలం పర్యాటకులు మాత్రమే కాకుండా, అత్యవసర పనులపై భారత్‌కు రావాల్సిన వారు, సెలవులకు వెళ్లాలనుకున్న కార్మికులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. విమాన సర్వీసులు రద్దు కావడమే కాకుండా, యుద్ధం కారణంగా విమాన ప్రయాణ మార్గాలను మార్చాల్సి రావడంతో టికెట్ ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. దీనికి తోడు, యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే గల్ఫ్ దేశాల ఆర్థిక వ్యవస్థ దెబ్బతిని, అక్కడ పనిచేస్తున్న లక్షలాది మంది భారతీయులు తమ ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదం కూడా ఉంది.

## వందల మంది అమాయకులు మృతి

### భారత్‌లో ఇరాన్ రాయబారి ఫతాలీ

న్యూఢిల్లీ: శనివారం అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన భారీ దాడుల్లో వందల మంది ఇరాన్ పౌరులు ప్రాణాలు కోల్పోయారని భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీ వెల్లడించారు. అయితే ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ, అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు ఎటువంటి హాని కలగలేదని, వారు పూర్తిగా సురక్షితంగా ఉన్నారని ఆయన ధృవీకరించారు. వారి భద్రత విషయంలో ఆందోళన అవసరం లేదని స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఫతాలీ మాట్లాడుతూ.. ఈ దాడులను ఇరాన్ సార్వభౌమాధికారంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ముఖ్యంగా మినాబ్ నగరంలోని ఓ బాలికల పాఠశాల లక్ష్యంగా జరిగిన దాడిలో 50 మందికి పైగా విద్యార్థినులు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. ఇరాన్ ఎప్పుడూ యుద్ధాన్ని కోరుకోలేదని, కానీ తమ దేశంపై దాడి జరిగితే ఐక్యరాజ్యసమితి చార్టర్‌లోని ఆర్టికల్ 51 ప్రకారం ఆత్మరక్షణ కోసం దీటుగా బదులిస్తామని హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇక దౌత్యపరమైన చర్చలకు ఆస్కారం లేదని, యుద్ధ భాషలోనే సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. ఇక ఇరాన్‌లో ఉన్న భారతీయ విద్యార్థులు, ఉద్యోగుల భద్రతపై కూడా ఆయన కీలక ప్రకటన చేశారు. ఇప్పటి వరకు భారతీయులకు ఎలాంటి హాని జరిగినట్లు సమాచారం లేదని తెలిపారు. అక్కడి అధికారుల సూచనలు పాటించాలని కోరారు. ఒకవేళ భారతీయులను వెనక్కి తీసుకురావాల్సిన పరిస్థితి వస్తే, భారత ప్రభుత్వంతో కలిసి పనిచేయడానికి ఇరాన్ సిద్ధంగా ఉందని రాయబారి హామీ ఇచ్చారు.



## ఇజ్రాయెల్ దాడులు హేయం: రష్యా

మాస్కో: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన సాయుధ దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. ఇవి ఎటువంటి కవ్వింపు చర్యలు లేకుండా చేసిన దాడులని, వెంటనే పరిస్థితిని చక్కదిద్ది రాజకీయ, దౌత్యపరమైన పరిష్కారం దిశగా అడుగులు వేయాలని రష్యా సూచించింది. ఈ మేరకు శనివారం రష్యా విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. శనివారం ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చి.. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లవ్రోవ్‌కు ఫోన్ చేసి తాజా పరిస్థితులను వివరించారు. అమెరికా, ఇజ్రాయెల్ దాడులను తిప్పికొట్టేందుకు ఇరాన్ తీసుకుంటున్న చర్యలను ఆయన లవ్రోవ్‌కు తెలిపారు. శాంతియుత చర్చలకు ఈ దాడులు విఘాతం కలిగించాయని, దీనిపై అత్యవసరంగా ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు ఇరాన్ మంత్రి పేర్కొన్నారు. దీనిపై స్పందించిన లవ్రోవ్.. ఇరాన్‌పై జరిగిన దాడులు అంతర్జాతీయ చట్టాలను, నిబంధనలను ఉల్లంఘించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు ప్రాంతీయ, ప్రపంచ భద్రతకు తీవ్ర ముప్పు కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులను తక్షణమే నిలిపివేయాలని కోరారు. ఐక్యరాజ్యసమితి వేదికగా శాంతియుత పరిష్కారాల కోసం రష్యా తన వంతు సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. మరోవైపు, ఇరాన్‌లో 'మేజర్ కంబాట్ ఆపరేషన్స్' (భారీ స్థాయి పోరాట చర్యలు) ప్రారంభించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ధృవీకరించారు. కాగా, తాము అమెరికాతో దౌత్యపరమైన చర్చల్లో ఉండగానే ఈ దాడులు జరిగాయని ఇరాన్ విదేశాంగ శాఖ ఆరోపించింది. ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ వెంటనే స్పందించి ఈ దురాక్రమణను అడ్డుకోవాలని ఇరాన్ డిమాండ్ చేసింది.

## దుబాయ్ ఎయిర్ పోర్టులో చిక్కుకున్న సింధు

### ఆల్ ఇంగ్లాండ్ టోర్నీకి వెళ్తుండగా ఊహించని అనుభవం

దుబాయ్: రెండు సార్లు ఒలింపిక్ మెడల్ సాధించిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు ప్రయాణంలో ఊహించని అనుభవం ఎదురైంది. శనివారం ఆమె దుబాయ్ ఎయిర్‌పోర్టులో చిక్కుకుపోయింది. ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనేందుకు ఇంగ్లాండ్‌లోని బర్మింగ్‌హామ్ వెళుతుండగా ఈ సంఘటన జరిగింది. అమెరికా, ఇజ్రాయెల్ మరియు ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడంతో విమాన రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ట్రాన్సిట్ కోసం దుబాయ్ చేరిన సింధు అక్కడే ఆగిపోవాల్సి వచ్చింది. దీనికి సంబంధించి సింధు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేసింది. ఎయిర్‌పోర్టు మొత్తం ప్రయాణికులతో కిక్కిరిసిపోవడం, తదుపరి అప్డేట్ కోసం అందరూ ఎదురుచూస్తుండటం ఆ వీడియోలో కనిపిస్తోంది. "తదుపరి ప్రకటన వచ్చేవరకు అన్ని విమానాలు రద్దు" అని సింధు పేర్కొంది. అంతేకాదు, ఆమె ఎక్స్ లోనూ తన స్పందన వెలిబుచ్చింది. "ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న



పరిణామాలు చూస్తుంటే ఏమీ అర్థం కావడం లేదు. నా కళ్ల ముందే ఆకాశంలో క్షిపణి దాడులు, పేలుళ్ల శబ్దాలు వింటుంటే వెన్నులో వణుకు పుడుతోంది. సోషల్ మీడియాలో, వార్తల్లో వస్తున్న భయానక వీడియోలు చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. దుబాయ్ అంటే నాకు ఎంతో ఇష్టం.. ఎప్పుడూ ప్రశాంతంగా, ఎంతో సేఫ్ గా ఉండే ఈ నగరంలో ఇలాంటి యుద్ధ వాతావరణం చూస్తానని కలలో కూడా అనుకోలేదు. ఇది నిజంగా నమ్మశక్యం కాని పరిస్థితి. నా క్షేమ సమాచారం కోసం ఆరా తీస్తూ మెసేజ్ లు చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. మీ ప్రేమ నాకు కొండంత బలాన్ని ఇస్తోంది. ప్రస్తుతానికి నేను, నా టీమ్ సభ్యులు దుబాయ్ లోనే క్షేమంగా ఉన్నాం. కానీ ఇరాన్ యుద్ధం కారణంగా ఇక్కడ పరిస్థితులు వేగంగా మారిపోతున్నాయి. మేం ప్రస్తుతం ఇక్కడే చిక్కుకుపోయాం. ఎయిర్ పోర్ట్ అంతా గందరగోళంగా, అల్లకల్లోలంగా ఉంది. ఎంతోమంది ప్రయాణికులు, చిన్న పిల్లలతో ఉన్న కుటుంబాలు ఎక్కడికి వెళ్లాలో తెలియక పడిగాపులు కాస్తున్నారు. మేం కూడా ఈ క్లిష్ట పరిస్థితి నుంచి ఎప్పుడు బయటపడతామా అని ఆశగా ఎదురుచూస్తున్నాం. మనం గడుపుతున్న సాధారణ జీవితం ఎంత చిన్నదో.. ఎంత అస్థిరమైనదో ఇలాంటి ఘటనలు చూసినప్పుడే మనసుకు తడుతుంది. ఈ విపత్కర పరిస్థితుల్లో ఇక్కడ చిక్కుకున్న ప్రతి ఒక్కరూ క్షేమంగా బయటపడాలని, త్వరలోనే ఇక్కడ శాంతి నెలకొనాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నా" అని తన ట్వీట్ లో పేర్కొంది. మరోవైపు ఈ విషయంపై భారత బ్యాడ్మింటన్ సంఘం స్పందించింది. సింధుతో పాటు ఎమిరేట్స్ ఎయిర్‌లైన్స్ అధికారులతోనూ టచ్‌లో ఉన్నామని తెలిపింది.





## మా దేశంలో పాలన మార్పు అసాధ్యం

### ట్రంప్‌పై ఇరాన్ మంత్రి ఆగ్రహం

టెహ్రాన్: తమ దేశంలో పాలనను మార్చడం అసాధ్యమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ అన్నారు. తమకు ఎవరి సాయం అవసరం లేదని, మమ్మల్ని మేం రక్షించుకోగలమని పేర్కొన్నారు. తమ దేశానికి వ్యతిరేకంగా అమెరికా, ఇజ్రాయెల్ సైనిక చర్యలను ప్రారంభించి ఉండవచ్చని, కానీ పాలనను మాత్రం మార్చలేదని అన్నారు. ఉద్రిక్తలను తగ్గించుకోవడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కలిసి తమపై చేస్తున్న యుద్ధం చట్టవిరుద్ధమని విదేశాంగ మంత్రి మండిపడ్డారు. అమెరికా ఫస్ట్ అనే నినాదాన్ని డొనాల్డ్ ట్రంప్ ఇజ్రాయెల్ ఫస్ట్‌గా మార్చారని విమర్శించారు. దురాక్రమణదారులకు తమ సాయుధ బలగాలు సరైన గుణపాఠం చెబుతాయని అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడి నేపథ్యంలో టెహ్రాన్‌ను ఖాళీ చేయాలని ఇరాన్ తమ ప్రజలకు ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు, అమెరికా దాడి నేపథ్యంలో దుబాయ్, అబుదాబీ సహా వివిధ దేశాల్లోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు చేస్తోంది. 14 అమెరికా స్థావరాలపై చేసిన దాడిలో వందలాది మంది అమెరికా సైనికులు హతమైనట్లు ఇరాన్ ప్రకటించింది. కాగా, ఇరాన్‌పై దాడుల నేపథ్యంలో హర్మోజ్‌గాన్ ప్రావిన్సు మినాబ్ నగరంలో ఒక బాలికల పాఠశాలపై జరిగిన దాడిలో 40 మందికి పైగా మృతి చెందినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ దాడిలో మరో 45 మంది గాయపడ్డారు. దాడి సమయంలో పాఠశాలలో 170 మంది విద్యార్థులు ఉండగా, మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇరాన్ పారామిలిటరీ ఇస్లామిక్ రెవెల్యూషనరీ గార్డ్ కోర్‌కు ఇక్కడ స్థావరం ఉంది.



## లంబాడిపల్లిలో ఘనంగా వెంకన్న వార్షికోత్సవాలు

మల్యాల, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం లంబాడిపెల్లిలో శ్రీ పద్మావతి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి వార్షికోత్సవాలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం హోమం కార్యక్రమం అనంతరం ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలతో అలంకరించి అంగరంగ వైభవంగా కల్యాణం నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక ఉత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.



## ఎస్‌జీఆర్ విద్యార్థుల ప్రతిభ

మల్యాల, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): హైదరాబాద్ లో నిర్వహించిన కరాటే పోటీలలో పాల్గొని మల్యాలకు చెందిన ఎస్‌జీఆర్ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. వీరిని మల్యాల సర్పంచ్ బొట్ల జయ ప్రసాద్, ఉపసర్పంచ్ వినయ్, ఈవో, వార్డు సభ్యులు అభినందించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లను సర్పంచ్ అందజేశారు.



## కస్తూర్బా పాఠశాలలో ఘనంగా సైన్స్ డే

మల్యాల, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల కస్తూర్బా పాఠశాలలో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ క్రాఫ్టింగ్స్, అల్లికల బ్యాగులు, చేతి గాజులు, గౌనులను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ బొట్ల జయ ప్రసాద్ విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వినయ్, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి, స్కూల్ ప్రధానోపాధ్యాయులు, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొండగట్టు ఈవో బదిలీ

మల్యాల, ఫిబ్రవరి 28 (ఈవార్తలు): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి ఆలయ ఈవో శ్రీకాంతారావు బదిలీ అయ్యారు. ఆయనను మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఈవోగా బదిలీ చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## బెంగాల్‌లో మళ్లీ 8 లక్షల ఓట్ల తొలగింపు



కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితాను ప్రచురించింది. పశ్చిమ బెంగాల్ ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్ అగర్వాల్ ప్రకారం, మొత్తం 66 లక్షల మంది ఓటర్లను తొలగించారు. గత సంవత్సరం ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేసిన సమయంలో 58 లక్షల ఓట్లు తొలగించగా, ఈసారి 8 లక్షల ఓట్లను తొలగించారు. దీంతో తొలగించిన ఓటర్ల సంఖ్య 66 లక్షలకు చేరింది. అదేవిధంగా మరో 60 లక్షలకు పైగా ఓటర్లను పరిశీలన జాబితాలో చేర్చారు. ఈ ఓటర్ల వివరాలను జ్యుడిషియల్ అధికారులు తనిఖీ చేయనున్నారు. మొత్తం 7.66 కోట్లమంది ఓటర్ల జాబితాతో గత సంవత్సరం నవంబర్ 4న బెంగాల్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియ మొదలైంది. డిసెంబర్ 16న ముసాయిదా జాబితాను విడుదల చేశారు. మరణాలు, వలసలు, నకిలీల వంటి కారణాలతో 58 లక్షల ఓట్లను తొలగించారు. దీంతో ఓటర్ల సంఖ్య 7.08 కోట్లకు తగ్గింది. విచారణలు, పరిశీలనల అనంతరం తాజాగా అదనంగా 8 లక్షల ఓట్లు తొలగించే అవకాశం ఉన్నట్లు సీనియర్ అధికారులు తెలిపారు. 7.08 కోట్ల మంది ఓటర్లలో ఇప్పటి వరకు దాదాపు 6.4 కోట్ల మందిని ఆమోదిత జాబితాలో చేర్చారు. తుది జాబితా విడుదలైన తర్వాత గణాంకాలపై నిర్ధారణకు రావొచ్చని అధికారులు వెల్లడించారు.



## ఆర్టీసీ చరిత్రలో అతిపెద్ద ప్రమాదం

కొండగట్టు ప్రమాదం (2018): జగిత్యాల జిల్లా కొండగట్టు ఘాట్ రోడ్డులో ఆర్టీసీ బస్సు లోయలో పడిన ఘటనలో 64 మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది తెలంగాణ ఆర్టీసీ చరిత్రలోనే అత్యంత భారీ ప్రాణనష్టం కలిగించిన ప్రమాదం. ఆ తర్వాత రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో ఒక టిప్పర్ లారీ ఢీకొన్న ఘటనలో 24 మంది దుర్మరణం చెందారు. బస్సులో ప్రయాణిస్తున్న 74 మంది గాయపడ్డారు.






# బస్సు చక్రం.. బతుకు ఛిద్రం

## ఇటీవలి భారీ ప్రమాదాలు :

ఆదిలాబాద్ జిల్లా (ఉట్నూర్): ఫిబ్రవరి 23, 2026న ఆసిఫాబాద్ డిపోకు చెందిన బస్సు షాంపూర్ సమీపంలో వంతెన పైనుండి వాగులోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు 22 నుండి 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

జోగులాంబ గద్వాల జిల్లా (ఇటిక్యాలపాడు): ఫిబ్రవరి 19, 2026న హైదరాబాద్ నుండి అనంతపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

రంగారెడ్డి జిల్లా (చేవెళ్ల): నవంబర్ 2025లో చేవెళ్ల సమీపంలో ఒక టిప్పర్ లారీ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో 24 మంది ప్రయాణికులు మరణించారు. బస్సులో ప్రయాణిస్తున్న 70 మందిలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

జనగామ జిల్లా (నిడిగొండ): నవంబర్ 16, 2025న ఆగి ఉన్న లారీని రాజధాని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు మృతి చెందగా, ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.



## ముఖ్యమైన అంశాలు:

ఆర్టీసీ ప్రమాదాల్లో మరణించిన వారిలో ఎక్కువ మంది ద్విచక్ర వాహనదారులు (562 మంది), ఆ తర్వాత పాదచారులు (314 మంది) మరియు ఆర్టీసీ ప్రయాణికులు (124 మంది) ఉన్నారు.

2024-25లో ప్రమాదాల సంఖ్య స్వల్పంగా తగ్గినప్పటికీ, మరణాల రేటు, చెల్లించిన పరిహారం భారీగా నమోదైంది.

మితిమీరిన వేగం, డ్రైవర్ల అలసట, శిక్షణ లేని డ్రైవర్లు ప్రధాన కారణాలుగా గుర్తించారు.

రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులపై 656, రాష్ట్ర రహదారులపై 117 ప్రమాదకర ప్రాంతాలు ఉన్నాయి.

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ) బస్సుల్లో వరుసగా చోటుచేసుకుంటున్న ప్రమాదాలు ప్రయాణికుల భద్రతపై తీవ్ర ఆందోళనలు రేకెత్తిస్తున్నాయి. ఇటీవలి కాలంలో జరిగిన పలు ప్రమాదాలు రోడ్డు భద్రత, బస్సుల నిర్వహణ, డ్రైవర్ల శిక్షణపై అనుమానాలు తలెత్తుతున్నాయి. గడిచిన మూడేళ్లలో 700 నుండి 800 ప్రమాదాలు జరిగాయి. ప్రమాదాలే కాదు.. సంస్థ చెల్లిస్తున్న పరిహారం కూడా 59 కోట్ల నుండి 83 కోట్లకు పెరగడం ఆర్థికంగానూ సంస్థపై పెను భారాన్ని మోపుతోంది.

ఆర్టీసీ కేవలం లాభనష్టాల బేరీజు వేయడమే కాకుండా, ప్రయాణికుల భద్రతకు అగ్రపీఠం వేయాలి. డ్రైవర్లకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు, కౌన్సెలింగ్ నిర్వహించాలి. ఆధునిక సాంకేతికతను (జీపీఎస్, వేగ నియంత్రణ పరికరాలు) వాడుతూ బస్సుల వేగాన్ని పర్యవేక్షించాలి. ముఖ్యంగా పాతబడిన బస్సుల స్థానంలో కొత్త వాహనాలను ప్రవేశపెట్టడం అత్యవసరం. సిబ్బంది కొరత కారణంగా డ్రైవర్లు అదనపు గంటలు పనిచేయాల్సి రావడం, ఫలితంగా కలిగే అలసట ప్రమాదాలకు దారితీస్తోంది. ఆర్టీసీలో అద్దె బస్సుల సంఖ్య పెరగడం, వాటి డ్రైవర్లకు సరైన శిక్షణ, పర్యవేక్షణ లేకపోవడం ఒక బలహీనతగా మారింది.

(ఈవార్తలు - నిఘా విభాగం)

పాతబడిన బస్సులు, బ్రేక్ ఫెయిల్యూర్లు, సమయానుకూల మెయింటెనెన్స్ లేకపోవడం ప్రయాణికుల ప్రాణాలను గాలిలో దీపంలా మారుస్తున్నాయి. శనివారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో శనివారం మధ్యాహ్నం భారీ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రుద్రారం గ్రామం వద్ద ముంబై జాతీయ రహదారిపై ప్రయాణికులతో వెళ్తున్న మూడు బస్సులు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. రుద్రారం బస్టాప్ వద్ద ఒక బస్సు ప్రయాణికులను ఎక్కించుకుంటున్న క్రమంలో వెనుక నుంచి వస్తున్న మరో ఆర్టీసీ బస్సు, దాని వెనుక ఉన్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు నియంత్రణ కోల్పోయి ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ క్రమంలో రెండు ఆర్టీసీ బస్సులు , ఒక ప్రైవేట్ బస్సు దెబ్బతిన్నాయి. బస్సులు బలంగా ఢీకొనడంతో లోపల ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా కిందపడిపోయారు. పలువురికి గాయాలయ్యాయి. మరో ఘటనలో సదాశివపేట సమీపంలో ఎన్‌హెచ్-65 బైపాస్‌పై టీఎస్ఆర్టీసీ బస్సు లారీని ఢీకొన్న 15 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ఒక వారం ముందే, ఫిబ్రవరి 23న ఆదిలాబాద్ జిల్లా ఉత్నూర్ మండలం శ్యాంపూర్ వద్ద ఆర్టీసీ బస్సు బ్రిడ్జి నుంచి డ్రై స్ట్రీమ్‌లో పడిపోయింది.




## 2025లో ప్రమాదాలు:

చేవెళ్ల ఘోర ప్రమాదం (నవంబర్ 3, 2025): రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం మీర్జాగూడ వద్ద తాండూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును అతివేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. ఈ ఘోర ప్రమాదంలో 24 మంది ప్రయాణికులు ప్రాణాలు కోల్పోయారు మరియు 30 మందికి పైగా గాయపడ్డారు. మృతులలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు సోదరీమణులు మరియు 40 రోజుల పసికందు కూడా ఉన్నారు.

కరీంనగర్ బస్సు-ట్రాక్టర్ ఢీ (నవంబర్ 4, 2025): తిమ్మాపూర్ మండలం రేణికుంట వంతెనపై మెట్‌పల్లి వైపు వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సు వడ్ల లోడుతో ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ఘటనలో 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు.

నారాయణపేట అగ్నిప్రమాదం (సెప్టెంబర్ 8, 2025): కోస్గి బస్టాండ్ నుండి బయల్దేరిన బస్సులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు.

జీడిమెట్ల ప్రమాదం (జూన్ 28, 2025): జీడిమెట్ల డిపో నుండి బయటకు వస్తున్న బస్సును ఒక ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు.

మహేశ్వరం శ్రీశైలం హైవే (మే 4, 2025): రంగారెడ్డి జిల్లా తుమ్మలూరు గేట్ సమీపంలో ఒక ప్రైవేట్ బస్సు రాంగ్ రూట్‌లో వచ్చి ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 30 మంది ప్రయాణికులు గాయపడ్డారు.





## బస్సుల ప్రమాదాలకు ప్రధాన కారణాలు:

**అధిక వేగం:** చాలా ప్రమాదాల్లో బస్సు లేదా ఎదురుగా వచ్చే వాహనాలు అధిక వేగంతో ప్రయాణించడం వల్ల ఢీకొన్న ఘటనలు జరిగాయి. 2025 నవంబర్‌లో రంగారెడ్డి జిల్లాలో జరిగిన ఘోర ప్రమాదంలో టిప్పర్ లారీ అధిక వేగంతో రాంగ్ రూట్2లో వచ్చి బస్సును ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు.

**డ్రైవర్ నిర్లక్ష్యం, ఫటీగ్:** డ్రైవర్లు నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, అలసట వల్ల నియంత్రణ కోల్పోవడం వంటివి జరుగుతున్నాయి. 2026 ఫిబ్రవరి 23న అదిలాబాద్ జిల్లా ఉత్నూర్ సమీపంలో బస్సు స్ట్రీమ్‌లో పడిపోవడానికి డ్రైవర్ నియంత్రణ కోల్పోవడమే కారణమని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

**రోడ్డు లోపాలు, బ్లాక్ స్పాట్లు:** రోడ్డు మలుపులు, హెచ్చరిక బోర్డుల లోపం, బారియర్లు లేకపోవడం వంటివి ప్రమాదాలను పెంచుతున్నాయి. 2026 ఫిబ్రవరి 28న సంగారెడ్డి జిల్లా సదాశివపేట బైపాస్‌లో జరిగిన ప్రమాదంలో షార్ప్ టర్నింగ్ పాయింట్ ప్రధాన కారణమని పోలీసులు పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి బ్లాక్ స్పాట్‌గా పేరుంది.

**రాంగ్ రూట్ డ్రైవింగ్:** ఇతర వాహనాలు రాంగ్ రూట్‌లో వచ్చి ఢీకొంటున్న ఘటనలు ఎక్కువయ్యాయి.

**ఇతర కారణాలు:** ఓవర్‌లోడింగ్, వాహనాల మెయింటెనెన్స్ లోపాలు, ప్రయాణికులు లేదా పాదచారుల నిర్లక్ష్యం కూడా కొన్ని ఘటనల్లో కారణం అవుతున్నాయి.

## గత మూడేళ్ల ఆర్టీసీ బస్సుల ప్రమాదాలు:

అధికారిక నివేదికల ప్రకారం, ఏటా సగటున 300 మందికి పైగా ఆర్టీసీ బస్సు ప్రమాదాల్లో మరణించారు.

| ఆర్థిక సంవత్సరం | ప్రమాదాలు | మరణాలు | చెల్లించిన పరిహారం |
|---|---|---|---|
| 2025-26 | 512 | 214 | రూ.74.26 కోట్లు |
| 2024-25 | 754 | 315 | రూ.83.07 కోట్లు |
| 2023-24 | 795 | 330 | రూ.73.80 కోట్లు |
| 2022-23 | 743 | 307 | రూ.59.88 కోట్లు |



## వయ్యారి చిత్రం



## కాశీకి వెళ్లానంటే..
# రాత్రికి రేటెంత అంటున్నారు

**పోకిరీ నెటిజన్లపై రేణు దేశాయ్ ఫైర్**


తన పోస్టులకు కొందరు పెడుతున్న బ్యాడ్ కామెంట్స్ పై రేణు దేశాయ్ రెస్పాండ్ అయ్యారు. ఇన్ స్టాగ్రాంలో లాంగ్ వీడియో పోస్ట్ చేసి తన ఆవేదనను పంచుకున్నారు. ప్రస్తుతం ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. తనకు ఇప్పుడు ఎలాంటి వేధింపులు ఎదురైనా తాను ఎవరినీ వదలనని చెపారు. సైబర్ పోలీసులు వారు ఎక్కడ నివసిస్తున్నారో కనిపెట్టి అరెస్టు చేసేలా తాను చూసుకుంటానని చెప్పారు. ఇప్పటి వరకు తప్పుడు కామెంట్స్ చేయడం చాలు అని అన్నారు. అదే సమయంలో అందరికీ ఎలాంటి రైట్స్ ఉన్నాయో.. తనకు కూడా అంతే రైట్స్ ఉన్నాయని తెలిపారు. తాను ఒక సాధారణ పౌరురాలిని చెప్పారు. ఏ సెలబ్రిటీ, రాజకీయ నాయకుడిపై అయినా తప్పుడు కామెంట్ చేస్తే అదే చేసిన వారికే చెందుతుందని అన్నారు. "నీచ రాక్షసులు, సంస్కారం లేని మనుషులు.. సంస్కారం ఉంటే అలా మెసేజ్ పెట్టరు. మీరు చెత్త బూతులు పెడుతున్నారు. కాశీకి వెళ్లానని ఫోటో పెడితే రాత్రికి రేటెంత అని అడుగుతున్నారు. ఎలా ఎవరిని అడుగుతున్నారు" అని నిలదీశారు. కాశీలో బొట్టుతో దేవి బట్టలతో ఉన్నానని తెలిపారు. మామూలుగా బట్టల కోసం డిస్కషన్ స్టార్ట్ చేశారని చెప్పారు. తాను అమ్మవారి బట్టల్లో ఉంటే నైట్ రేటు అడుగుతున్నారని అన్నారు. ఇది అస్సలు కరెక్ట్ కాదు అని ఫైర్ అయ్యారు. ఇదేనా సంస్కారమని ప్రశ్నించారు. పబ్లిక్ ముందు వచ్చి కూర్చుంటానని, బండబూతులు తిట్టాలని సవాల్ విసిరారు. కానీ దానివల్ల ఏం ప్రయోజనం? ఏదైనా ఒక ప్రాణం నిలబడుతుందా? చెప్పండని అడిగారు.





## డే-1 100 కోట్ల టార్గెట్‌గా 'దురంధర్ 2'

భారతీయ సినీ చరిత్రలో విడుదలైన తొలి రోజే రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం ఇప్పటివరకు ప్రధానంగా సౌత్ చిత్రాలకే సాధ్యమైంది. అయితే ఇప్పుడు బాలీవుడ్ నుంచి ఆ మైలురాయిని అందుకునేలా 'దురంధర్ 2' దూసుకొస్తోంది. ట్రేడ్ వర్గాల అంచనాల ప్రకారం ఈ చిత్రం మొదటి రోజే వంద కోట్ల మార్కును టచ్ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొద్ది నెలల క్రితం విడుదలైన 'దురంధర్' మొదటి భాగం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. 50 రోజులకు పైగా ప్రదర్శితమై వెయ్యి కోట్ల క్లబ్‌లోకి చేరడంతో పార్ట్-2పై అంచనాలు అమాంతం పెరిగాయి. అదే ఊపుతో ఇప్పుడు 'దురంధర్ 2' విడుదలకు సిద్ధమవుతోంది. హిందీ వెర్షనే తొలి రోజే సుమారు రూ.80 కోట్ల గ్రాస్ (దాదాపు రూ.70 కోట్ల నెట్) వసూలు చేసే అవకాశం ఉందని ట్రేడ్ అంచనా వేస్తోంది. ఈసారి చిత్రం పలు భాషల్లో డబ్బింగ్ అవుతూ విడుదల కావడం అదనపు ప్లస్ పాయింట్‌గా మారింది. ఇప్పటివరకు బాలీవుడ్ చిత్రాలకు దక్షిణాది మార్కెట్ నుంచి పెద్దగా వసూళ్లు రాలేదు. అయితే 'దురంధర్ 2'కు సౌత్‌లో కూడా మంచి క్రేజ్ ఏర్పడింది. డబ్బింగ్ వెర్షన్ల ద్వారా వచ్చే వసూళ్లు ఈ సినిమాను మ్యాజికల్ రూ.100 కోట్ల ఓపెనింగ్ వైపు నడిపిస్తాయని ట్రేడ్ విశ్లేషకులు భావిస్తున్నారు.





# విరోష్ కోసం.. రణబలి స్పెషల్ సర్ప్రైజ్

స్టార్ హీరో హీరోయిన్లు విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఇంకా పెళ్లి హడావుడిలోనే ఉండగా.. వారిద్దరికి సంబంధించిన మ్యారేజ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది! విజయ్- రష్మిక జంటగా మరోసారి నటిస్తున్న రణబాలి మూవీ టీమ్ ఆ వీడియో పోస్ట్ చేసింది. ప్రస్తుతం ఆ గ్లింప్స్.. అందరినీ ఆకట్టుకుని ఓ రేంజ్ లో సందడి చేస్తోంది. అయితే రణబాలి మూవీ టీమ్ విజయ్- రష్మిక రియల్ మ్యారేజ్ వీడియో పోస్ట్ చేసిందనుకుంటే పొరపాటే! తమ సినిమాలోని పెళ్లి పాటకు సంబంధించిన గ్లింప్స్ ను శనివారం ఉదయం రిలీజ్ చేసింది. అంతే కాదు.. కొత్త జంటకు బెస్ట్ విషెస్ కూడా తెలిపింది. సినిమాలో రణబాలి, జయమ్మగా విజయ్ దేవరకొండ, రష్మిక కనిపించనుండగా.. వాళ్ల లవ్ ను స్పెషల్ సర్ప్రైజ్ తో సెలబ్రేట్ చేస్తున్నామని రాసుకొచ్చింది. ఏందయ్యా సామి.. అంటూ సాగే పాటలో మేకర్స్ సినిమాలో విరోష్ వెడ్డింగ్ కు సంబంధించిన విజువల్స్ ను చూపించారు. పసుపు దంచడం, పెళ్లి, అత్తవారింట్లో జయమ్మ అడుగుపెట్టడం వంటి మూమెంట్స్ ను చూపించి మెప్పించారు.

## బన్నీతో చాన్స్.. 15 రోజులు తిండి మానేశా: హరితేజ

అల్లు అర్జున్ గురించి క్యారెక్టర్ ఆర్టిస్ట్ హరితేజ కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... "నాకు అల్లు అర్జున్ గారంటే చాలా ఇష్టం. ఆయన సినిమాలో ఎప్పుడు అవకాశం వస్తుందా అని ఎంతో ఆత్రుతగా ఎదురు చూశాను. అలాంటి సమయంలో నాకు దువ్వాడ జగన్నాథం చిత్రంలో అవకాశం వచ్చింది. ఆ సినిమాలో ఛాన్స్ రాగానే ఎంతో ఆనందపడ్డాను. అల్లు అర్జున్ లాంటి గొప్ప నటుడి పక్కన అవకాశం రాగానే నేను సన్నగా కనిపించాలి అనుకున్నాను. దానితో 15 రోజులపాటు ఆహారం ఏమీ తీసుకోకుండా కేవలం లిక్విడ్స్ మాత్రమే తీసుకున్నాను. దానితో నేను కాస్త సన్నబడ్డాను, సినిమాలో చాలా బాగా కనిపించాను" అని హరితేజ చెప్పుకొచ్చింది. సినిమాల్లో మంచి స్థాయిలో అవకాశాలు వస్తున్న సమయంలోనే ఈమె తెలుగు బిగ్ బాస్ షోలో పార్టిసిపేట్ చేసి ఎంతోమంది బుల్లితెర ప్రేక్షకులను అలరించింది. ప్రస్తుతం ఈమె పెద్ద స్థాయిలో సినిమాలు చేయకపోయినా అడపాదడపా మూవీల్లో నటిస్తూ మంచి దశలోనే కెరియర్ను ముందుకు సాగిస్తుంది.





## రెచ్చిపోయిన యశ్, కియారా!

'టాక్సిక్' సినిమా మొదటి పాట మార్చి 2న విడుదల కానుంది. ఈ పాట యష్, కియారా అద్వానీల మధ్య సాగనుందని తెలుస్తోంది. ఈ పాట చాలా హాట్, రొమాంటిక్‌గా ఉంటుందని లేటెస్ట్ గా రిలీజైన పోస్టర్ సూచిస్తుంది. ఈ పాట పేరు 'తబాహి'. ప్రముఖ సంగీత దర్శకుడు విశాల్ మిర్శా ఈ పాటకు సంగీతం సమకూర్చారు. పాట పోస్టర్‌లో యష్ కియారా అద్వానీని మోసుకెళ్తున్న సన్నివేశం ఉంది. ఈ పోస్టర్‌లో కియారా ముఖం కనిపించడం లేదు. కానీ ఆమె చాలా గ్లామరస్‌గా కనిపించడం ఖాయమని తెలుస్తోంది. 'టాక్సిక్' చిత్రంలోని అన్ని పాటలను అన్ని భాషల్లో 'జీ మ్యూజిక్' ద్వారా విడుదల చేయనున్నారు. విశాల్ మిశ్రా 4 పాటలకు సంగీతం సమకూర్చారు. అర్జాన్ నిజామి, ఫహీమ్ అబ్దుల్లాతో కలిసి తనిష్క్ బాగ్చీ ఒక పాటకు సంగీతం సమకూర్చారు. రవి బస్రురు ఒక పాటకు సంగీతం సమకూర్చారు అలాగే అతనే బీజీఎమ్ సమకూర్చారు. మొత్తం 5 మంది సంగీత దర్శకులు ఈ చిత్రానికి పనిచేశారు. టాక్సిక్ చిత్రాన్ని 'కెవిఎన్ ప్రొడక్షన్స్' నిర్మించింది. మార్చి 19న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.



## స్పిరిట్ లో ఐశ్వర్య దేశాయ్

స్పిరిట్ సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్డేట్ కూడా ఒక సంచలనం సృష్టిస్తోంది. అందులో భాగంగానే తాజాగా వివేక్ ఒబెరాయ్ లుక్ పోస్టర్ రిలీజ్ చేయగా.. ఆయన పక్కనే కూర్చుని.. బ్లాక్ గాగుల్స్ ధరించి, సీరియస్ లుక్ లో కనిపిస్తున్న ఒక నటి అందరి దృష్టిని విపరీతంగా ఆకర్షించింది . దీంతో ఆమె ఎవరు? ఆమె బ్యాక్ గ్రౌండ్ ఏంటి? స్పిరిట్ లో ఆమె పాత్ర ఏంటి? అసలు ఆమెను తీసుకోవడం వెనుక అసలు కారణం ఏమిటి ? ఇలా పలు రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు నెటిజన్స్. ఆమె ఎవరో కాదు ఐశ్వర్య దేశాయ్. ఇండో అమెరికన్ మోడల్ గా గుర్తింపు తెచ్చుకున్న ఈమె.. అంతర్జాతీయ స్థాయిలో పలు ఫ్యాషన్ షోలలో పాల్గొని ప్రసిద్ధ బ్రాండ్లకు సంబంధించిన ప్రకటనలలో నటించి, తనకంటూ మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. ఇప్పటికే గల్లీ బాయ్స్, రాట్ ఇన్ ద కిచెన్ వంటి చిత్రాలలో నటించి తన నటనతో ఆకట్టుకుంది. ఆ నటన అనుభవమే ఇప్పుడు ఏకంగా సందీప్ రెడ్డి సినిమాలో కీలకమైన పాత్ర దక్కేలా చేసింది.

## సిగరెట్, మందు.. అంతా ఫేక్: నయన్ సారిక

కింగ్ ఆఫ్ ఎంటర్టైన్మెంట్ శ్రీవిష్ణు లీడ్ రోల్ లో నటించిన విష్ణు విన్యాసం మూవీ రీసెంట్ గా రిలీజవ్వగా.. ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వస్తోంది. సినిమాలో నయన్ సారిక హీరోయిన్ గా నటించి తన యాక్టింగ్ తో అందరినీ ఆకట్టుకుంది. మనీషాగా మెప్పించింది. మూవీలో కడుపుబ్బా నవ్వించిన శ్రీవిష్ణుకు పోటీగా ఆమె కూడా మూవీలో తన కామిక్ టైమింగ్ తో నవ్వించడం విశేషమని చెప్పాలి. విష్ణుతో నయన్ సారిక కెమిస్ట్రీ వర్కౌట్ అయింది. అయితే సినిమాలోని కొన్ని సీన్స్ లో ఆమె.. సిగరెట్ తాగుతూ, మందు కొడుతూ కనిపించారు. ఇప్పుడు ఆ సీన్స్ పై ఆమె.. మూవీ సక్సెస్ మీట్ లో రెస్పాండ్ అయ్యారు. రీసెంట్ గా మేకర్స్ సక్సెస్ మీట్ ఏర్పాటు చేయగా.. అందులో నయన సారిక సందడి చేశారు. ఫుల్ జోష్ లో.. చాలా యాక్టివ్ గా కనిపించారని చెప్పాలి. ఆ సమయంలో సినిమాలో సిగరెట్ తాగారు.. మందు కొట్టారు.. ఎలా అనిపించింది? అంటూ ఓ మీడియా ప్రతినిధి ఫన్నీ క్వశ్చన్ అడ్డగా.. నయన్ సారిక నవ్వుతూ ఆన్సర్ ఇచ్చారు. తనకు వచ్చిన తెలుగులో అవి రియల్ కావంటూ.. రియల్ కాదంటూ చెప్పుకొచ్చారు. మందు బదులు వాటర్ తాగానని, సిగరెట్ అంటే హెర్బల్ సిగరెట్ చేసి ఇచ్చారని చెప్పారు.



## పాక్ ఇంటికి..
# సెమీఫైనల్ వేదికలు ఖరారు

పొట్టి ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించడంతో భారత్‌లోనే బిగ్ మ్యాచ్‌లు జరుగనున్నాయి. సూపర్ 8 చివరి మ్యాచ్‌లో శ్రీలంకను 147లోపు కట్టడి చేయలేక పాక్ ఇంటిదారి పట్టడంతో సెమీస్ వేదికలపై నెలకొన్న సందిగ్ధతకు తెరపడింది. న్యూజిలాండ్ ఫైనల్ చేరడంతో.. ఈడెన్ గార్డెన్స్, వాంఖడేలో సెమీ ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోంది. గ్రూప్ బీ నుంచి న్యూజిలాండ్ సెమీస్ బెర్తు పట్టేయగా.. భారత్‌లోనే షెడ్యూల్ ప్రకారం అనుకున్న సెమీ ఫైనల్, ఫైనల్ వేదికల్ని ఐసీసీ, బీసీసీఐ ఖరారు చేశాయి. ఒకవేళ పాక్ అర్హత సాధించి ఉంటే కొలంబోలోనే సెమీస్, ఒకవేళ ఫైనల్‌కు చేరితే.. ఈ మ్యాచ్ కూడా అక్కడే ఆడించాల్సి వచ్చేది.

# వాంఖడే పెవిలియన్‌కు రవిశాస్త్రి పేరు

భారత దిగ్గజం రవి శాస్త్రికి ప్రత్యేక గౌరవం లభించనుంది. తొలి వరల్డ్‌కప్ హీరో రవి గౌరవార్థం పెవిలియన్ ఏర్పాటు చేయాలని ముంబై క్రికెట్ సంఘం సంకల్పించింది. ప్రస్తుతం పొట్టి కప్‌లో కామెంటేటర్‌గా అలరిస్తున్న రవి పేరును వాంఖడే మైదానంలోని లెవల్ 1 స్టాండ్‌కు ఖరారు చేశామని ఎంసీఏ ఒక ప్రకటనలో తెలిపింది. క్రికెట్ లెజెండ్‌కు ఈ గౌరవం దక్కడం పట్ల అభిమానులు, మాజీ ఆటగాళ్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమదైన ఆటతో భారత క్రికెట్‌పై చెరగని ముద్ర వేసిన ఆటగాళ్లు చాలామంది. సుదీర్ఘ కాలం సేవలందించి.. క్రికెట్ వ్యాప్తికి తోడ్పడిన ఈ దిగ్గజాలను ఆయా రాష్ట్ర క్రికెట్ సంఘాలు గొప్పగా గౌరవిస్తుంటాయి. ఈ క్రమంలోనే వారి పేరు మైదానంలో నిలిచిపోయేలా స్టాండ్స్ ఏర్పాటు చేస్తుంటాయి. ముంబై క్రికెట్ సంఘం కూడా ఇప్పుడు లెజెండ్ రవి శాస్త్రి పేరుతో పెవిలియన్ ఏర్పాటు చేయనుంది. ఈ విషయాన్ని ఎంసీఏ అధ్యక్షుడు అజింక్యా నాయక్ వెల్లడించాడు. దిగ్గజ ఆటగాళ్లు వేసిన పునాదులపైనే ముంబై క్రికెట్ నిర్మితమైంది.



# తట్టాబుట్ట.. పాక్ నెత్తిన!

### ఇంటిదారి పట్టించిన శ్రీలంక
### పోరాడి ఓడిన లంక టీం



ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీని శ్రీలంక ఓటమితో ముగించింది. పాకిస్థాన్‌తో పల్లెకెలె వేదికగా శనివారం జరిగిన ఆఖరి మ్యాచ్‌లో శ్రీలంక పోరాడి ఓడింది. ఓ దశలో ఘోర పరాజయం దిశగా సాగిన శ్రీలంక.. డసన్ షనక(31 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సలతో 76 నాటౌట్) అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శనతో తృటిలో విజయాన్ని చేజార్చుకుంది. చివరకు 5 పరుగుల తేడాతో ఓటమిపాలైంది.

**ఈ మ్యాచ్‌లో ఓడినా.. పాకిస్థాన్‌ను తమ వెంట ఇంటికి తీసుకెళ్లింది. గ్రూప్-2 నుంచి ఇంగ్లండ్, న్యూజిలాండ్ సెమీఫైనల్ చేరాయి. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 212 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్లు షాహిబ్జాదా ఫర్హాన్(60 బంతుల్లో 9 ఫోర్లు, 5 సిక్సలతో 100), ఫకార్ జమాన్(42 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సలతో 84) విధ్వసంకర బ్యాటింగ్‌తో రాణించారు. ఈ ఇద్దరే తొలి వికెట్‌కు 176 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని అందించారు.**

ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు తీవ్రంగా నిరాశపర్చారు. శ్రీలంక బౌలర్లలో దిల్షాన్ మధుషంక(3/33) మూడు వికెట్లు తీయగా.. డసన్ షనక(2/42) రెండు వికెట్లు పడగొట్టాడు. దుష్మంత చమీర(1/48) ఒక వికెట్ తీసాడు. అనంతరం శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లకు 207 పరుగులు చేసింది. డసన్ షనకతో పాటు పవన్ రత్నాయకే(37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 58) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. పాకిస్థాన్ బౌలర్లలో అబ్రార్ అహ్మద్(3/23) మూడు వికెట్లు తీయగా.. షాహీన్ షా అఫ్రిది, నసీమ్ షా, మహమ్మద్ నవాజ్ తలో వికెట్ తీసారు. 213 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో శ్రీలంకకు ఆశించిన ఆరంభం దక్కలేదు. పాకిస్థాన్ బౌలర్లు కట్టడి బౌలింగ్ చేయడంతో ఓ దశలో శ్రీలంక 147 పరుగులైనా చేస్తుందా? అనిపించింది. పాకిస్థాన్ సెమీస్ చేరలంటే 65 పరుగులు భారీ తేడాతో గెలవాల్సి ఉండటంతో ఆ జట్టు గట్టిగా ప్రయత్నించింది. నసీమ్ షా, అబ్రార్ అహ్మద్(3/23), మహమ్మద్ నవాజ్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 101 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. మరో 46 పరుగుల వ్యవధిలోనే ఐదు వికెట్లు తీసేలా కనిపించింది. కానీ శ్రీలంక బ్యాటర్లలో పవన్ రత్నాయకే(37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సలతో 58), డసన్ షనక అద్భుతమైన బ్యాటింగ్‌తో పాకిస్థాన్ సెమీస్ అవకాశాలను దెబ్బతీసారు. డ్యూ కూడా రావడంతో ఆకాశమే హద్దుగా చెలరేగారు. శ్రీలంక విజయానికి 12 బంతుల్లో 46 పరుగులు అవసరం కాగా.. షనక 19వ ఓవర్‌లో రెండు భారీ సిక్సలతో 18 పరుగులు పిండుకున్నాడు. ఆఖరి ఓవర్‌లో 28 పరుగులు అవసరం కాగా.. షాహీన్ అఫ్రిది బౌలింగ్‌2లో షనక వరుసగా 4, 6, 6, 6 బాది వణికించాడు. ఐదో బంతి డాట్ కాగా.. ఆఖరి బంతికి సిక్సర్ అవసరమైంది. షాహీన్ వేసిన వైడ్ యార్కర్‌ను శనక వదిలేశాడు. అది వైడ్ అని అతను భావించినప్పటికీ, అంపైర్ 'ఫెయిర్ డెలివరీ'గా ప్రకటించడంతో పాకిస్థాన్ విజయం లాంఛనమైంది. పొట్టి ప్రపంచకప్ నుంచి పాకిస్థాన్ నిష్క్రమించడంతో న్యూజిలాండ్ సెమీస్ చేరింది.

# జమ్మూకశ్మీర్ నయా చరిత్ర

### తొలి రంజీ ట్రోఫీ కైవసం.. కర్ణాటకపై భారీ విజయం

ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీని జమ్మూ కశ్మీర్ కైవసం చేసుకుంది. 67 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ తొలి టైటిల్‌ను ముద్దాడింది. కర్ణాటకతో జరిగిన ఫైనల్ డ్రాగా ముగియడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన జమ్మూ కశ్మీర్‌ను విజేతగా ప్రకటించారు. 186/4 స్కోర్‌తో చివరి రోజు ఆటను కొనసాగించిన జమ్మూ కశ్మీర్ రెండో ఇన్నింగ్స్‌ను 342/4 స్కోర్ వద్ద డిక్లేర్ చేసింది. మరో సెషన్ ఆట మాత్రమే మిగిలి ఉండటంతో ఇరు జట్ల కెప్టెన్లు డ్రాకు అంగీకరించారు. దాంతో టోర్నీ రూల్స్ ప్రకారం తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించిన జమ్మూ కశ్మీర్‌ను విజేతగా ప్రకటించారు. 1959-1960లో రంజీ ట్రోఫీలో అరంగేట్రం చేసిన జమ్మూ కశ్మీర్.. తన 67 ఏళ్ల దేశవాళీ చరిత్రలో రంజీ ట్రోఫీ ఫైనల్ చేరడం.. గెలవడం ఇదేతొలిసారి. 2025-26 సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచి బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన జమ్మూ కశ్మీర్.. ఫైనల్లోనూ అదే తరహా ప్రదర్శనతో విజేతగా నిలిచింది. ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ బారాముల్ల ఎక్స్‌ప్రెస్ ఆకిబ్ నబీ 60 వికెట్లతో జమ్మూ కశ్మీర్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ చరిత్రాత్మక క్షణాల్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రత్యక్షంగా వీక్షించారు. జమ్మూ కశ్మీర్ క్రికెట్




మాజీ డైరెక్టర్, బీసీసీఐ ప్రెసిడెంట్ మిథున్ మన్హాస్ ఈ మ్యాచ్‌ను తొలి రోజు నుంచే దగ్గరుండి చూశాడు. 2025-26 సీజన్‌లో తొలి మ్యాచ్ నుంచి బ్యాటింగ్, బౌలింగ్‌లో అద్భుత ప్రదర్శన కనబర్చిన జమ్మూ కశ్మీర్.. ఫైనల్లోనూ కర్ణాటకను మట్టికరిపించింది. కర్ణాటకలోని హుబ్లి వేదికగా జరిగిన ఈ ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన జమ్మూ కశ్మీర్ 584 పరుగులు భారీ స్కోర్ చేసింది. శుభమ్ పుండిర్(121) సెంచరీతో రాణించగా.. యవెర్ హసన్(88), కెప్టెన్ పరాస్ డొగ్రా(70), అబ్దుల్ సమద్(61), వధావన్(70), సాహిల్ లోత్రా(72) హాఫ్ సెంచరీలతో రాణించారు. కర్ణాటక బౌలర్లలో ప్రసిధ్ కృష్ణ(5/99) ఐదు వికెట్లతో సత్తా చాటాడు. అనంతరం కర్ణాటక 93.3 ఓవర్లలో 293 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ అగర్వాల్(266 బంతుల్లో 21 ఫోర్లతో 160) ఒంటరి పోరాటం చేయగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఆకిబ్ నబీ(5/54) ఐదు వికెట్లు తీయగా.. సునీల్ కుమార్(2/51), యుధ్వీర్ సింగ్(2/55) రెండేసి వికెట్లు పడగొట్టారు.



# కరేబియన్లను మట్టి కరిపిస్తమా?

### నేడే భారత్-వెస్టిండీస్ మ్యాచ్.. కోల్‌కతా వేదికగా డు ఆర్ డై

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా డూ ఆర్ డై మ్యాచ్‌కు సిద్ధమైంది. తమ ఆఖరి సూపర్-8 పోరులో భాగంగా నేటి(ఆదివారం) రాత్రి కోల్‌కతా వేదికగా జరిగే మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. ఇరు జట్లకు ఈ మ్యాచ్ క్వార్టర్ ఫైనల్ లాంటిది. ఇందులో గెలిచిన జట్టు సెమీస్ చేరనుండగా.. ఓడిన జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించనుంది. దాంతో ఈ మ్యాచ్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇరు జట్లు గెలుపే లక్ష్యంగా సిద్ధమవుతున్నాయి. గత టీ20 ప్రపంచకప్ 2024 తర్వాత ఇరు జట్లు ఒక్కసారి కూడా తలపడలేదు. ద్వైపాక్షిక టీ20 సిరీస్‌లో టీమిండియాను చివరిసారిగా ఓడించిన ఏకైక జట్టు కూడా వెస్టిండీస్. 2023 ఆగస్టులో భారత్‌పై విండీస్ టీ20 సిరీస్ గెలిచింది. అనంతరం భారత్ ఒక్క సిరీస్ కూడా కోల్పోలేదు. గత మూడేళ్లుగా ఇరు జట్లలో చాలా మార్పులు జరిగాయి. భారత్ బలం రెట్టింపు అవ్వగా.. వెస్టిండీస్ కూడా పటిష్టంగా మారింది. ఈ మెగా టోర్నీలో అత్యధిక సిక్సలు కొట్టిన జట్టుగా వెస్టిండీస్ ఉంటే.. ఆ జట్టు కంటే 3 సిక్సల తక్కువతో రెండో స్థానంలో టీమిండియా ఉంది. అయితే బలబలాల పరంగా టీమిండియానే హాట్ ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. విండీస్ కంటే భారత బౌలింగ్ విభాగం బలంగా ఉంది. మిస్టరీ స్పిన్‌తో పాటు వరల్డ్ క్లాస్ పేస్ బౌలర్లు ఉన్నారు. అయితే తమదైన రోజున విండీస్ ఆపడం ఎంత పెద్ద జట్టుకైనా కష్టం. ఈ కీలక పోరుకు టీమిండియా ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగే అవకాశం ఉంది. ప్రత్యర్థి జట్ల ఆఫ్ స్పిన్ మంత్రానికి చెక్ పెట్టేందుకు సంజూ శాంసన్ బరిలోకి దించుతూ టీమిండియా మేనేజ్‌మెంట్ రచించిన వ్యూహం ఫలించింది. దాంతో సంజూ, అభిషేక్ శర్మనే ఓపెనర్లుగా కొనసాగనున్నారు. ఇషాన్ కిషన్ ఫస్ట్ డౌన్‌లో ఆడనుండగా.. సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ మిడిలార్డర్‌లో ఆడనున్నారు. జింబాబ్వే మ్యాచ్ తరహాలో టాప్-6 బ్యాటర్లు చెలరేగితే.. టీమిండియాకు తిరుగుండదు. శివమ్ దూబే, అక్షర్ పటేల్ లోయరార్డర్‌లో ఆడనున్నారు. బౌలింగ్‌లో విఫలమవుతున్న శివమ్ దూబేను తప్పించాలనుకుంటే రింకూ సింగ్ తుది జట్టులోకి వస్తాడు. కానీ ఈ సాహసం టీమిండియా చేయకపోవచ్చు. ఇక బౌలింగ్‌లో బుమ్రా సూపర్ ఫామ్ భారత్‌కు కలిసొచ్చే అంశం. అతనితో పాటు అర్ష్‌దీప్ సింగ్, హార్దిక్ పాండ్యా, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్‌తో కూడిన భారత బౌలింగ్ దాడిని ఎదుర్కోవడం వెస్టిండీస్‌కు పెద్ద సవాలే. మిగతా కాంబినేషన్‌లో పెద్దగా మార్పులు జరిగే అవకాశం లేదు. కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్, వాషింగ్టన్ సుందర్, రింకూ సింగ్ బెంచ్‌కే పరిమితం కానున్నారు.

**జింబాబ్వేతో భారత తుది జట్టు(అంచనా)**

**భారత్:** అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, శివమ్ దూబే, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్ సింగ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా.



# ఇషాన్‌పై ఆఫ్ స్పిన్ అస్త్రం?

టీమిండియా విధ్వంసకర బ్యాటర్ ఇషాన్ కిషన్‌కు ఆఫ్ స్పిన్ బౌలింగ్ సవాల్‌గా మారింది. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్న ఇషాన్ కిషన్.. ఆఫ్ స్పిన్ బౌలర్లకు మాత్రం ఇబ్బంది పడుతున్నాడు. దాంతో ఇషాన్ కిషన్‌ను కట్టడి చేసేందుకు ప్రత్యర్థి జట్లు ఆఫ్ స్పిన్ బౌలర్లను అస్త్రంగా ఉపయోగిస్తున్నాయి. పవర్ ప్లేలోనే ఆఫ్ స్పిన్ బౌలర్లతో బౌలింగ్ చేయిస్తున్నాయి. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో ఇషాన్ కిషన్.. 6 మ్యాచ్‌ల్లో ఐదు సార్లు ఆఫ్ స్పిన్నర్‌కే ఔటయ్యాడు. నమీబియాతో మ్యాచ్‌లో ఎరాస్మస్ బౌలింగ్‌లో.. పాకిస్థాన్‌తో మ్యాచ్‌లో సైమ్ అయూబ్ బౌలింగ్‌లో వెనుదిరిగిన ఇషాన్ కిషన్.. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌లో ఆర్యన్ దత్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. సౌతాఫ్రికాతో జరిగిన సూపర్-8 మ్యాచ్‌లో మార్క్‌రమ్ బౌలింగ్‌లో .. జింబాబ్వేతో మ్యాచ్‌లోనూ ఆఫ్ స్పిన్నర్ అయిన సికందర్ రజా బౌలింగ్‌లోనే ఔటయ్యాడు. ఇటీవల ఇషాన్ కిషన్ మొత్తం 10 సార్లు ఆఫ్ స్పిన్నర్‌కు ఔటయ్యాడు. ఇతర బౌలర్లతో పోలిస్తే ఆఫ్ స్పిన్నర్లపై ఇషాన్ స్ట్రైక్ రేట్ తక్కువగా ఉంటోంది. ముఖ్యంగా బంతిని లోపలికి వేసే ఆఫ్ స్పిన్నర్ల బౌలింగ్‌లో ఇషాన్ డాట్ బాల్స్ ఎక్కువగా ఆడుతున్నాడు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లకు ఆఫ్ స్పిన్నర్లు సహజంగానే సవాలు విసురుతారు. ఇషాన్ కిషన్ ఎక్కువగా 'వైడ్ ఆఫ్ ది ఆఫ్ స్టంప్' వచ్చే బంతులను ఆడే క్రమంలో లేదా స్పిన్ అవుతున్న బంతిని డ్రైవ్ చేయబోయి క్యాచ్ ఇచ్చి ఔటవుతున్నాడు. ఐపీఎల్ కెరీర్‌లో కూడా ఇషాన్ కిషన్ ఆఫ్ స్పిన్నర్లకు 14 సార్లు ఔటయ్యాడు. దాంతోనే ఇషాన్‌కు చెక్ పెట్టేందుకు ప్రత్యర్థి జట్లు ఆఫ్ స్పిన్నర్లను బరిలోకి దించుతున్నాయి.

ఈవార్తలు ప్రజావాణి
సంపాదకీయం www.evarthalu.com
నేటి ఈవార్తలు
ఆదివారం 1-3-2026

శ్రావణ వాణి




# అప్పు చేసి పప్పు కూడు

## ..గొప్పలు.. తప్పని తిప్పలు

అప్పులున్నా.. పెద్ద బంగ్లాలో ఉండాలె..
తినడానికి తిండి లేకున్నా.. బుల్లెట్ బైక్ కొనాలె..
చేతిలో చిల్లి గవ్వ లేకున్నా.. ఐఫోన్ కావాలె..
చూపించుకోవాలె.. బజార్లో సోకులు..
స్తోమతకు మించి.. నెత్తిన అప్పులు..
లగ్జరీ మోజులో ఆడంబరాల వేట..
కృత్రిమ దర్పానికి అట్టహాసపు బాట..
నేటి సమాజంలో పెరుగుతున్న గొప్పలు!
ఇలాగైతే భవిష్యత్తులో తప్పవు తిప్పలు!!



శ్రావణ్ కుమార్ బొమ్మకంటి
ఎడిటర్, 95812 91919

ఉన్నది దాచుకోవడం పాత తరం మాటైతే, లేనిది ఉన్నట్లు చూపించుకోవడం నేటి తరం బాటగా మారింది. ఇదే ఇప్పుడు అనేక సామాజిక, ఆర్థిక సమస్యలకు మూల కారణమవుతోంది. 'అప్పు ఉన్నవాడు గాలికి కొట్టుకుపోతాడు' అన్నది పాత సామెత, కానీ ఇప్పుడు 'అప్పు చేసి అట్టహాసం ప్రదర్శించేవాడు' హీరోగా చలామణీ అవుతున్నాడు. ఇంట్లో కనీసం పౌష్టికాహారం తినడానికి స్తోమత లేకపోయినా, వీధిలో వెళ్తుంటే వెనక్కి తిరిగి చూడాలనే తాపత్రయంతో వేల రూపాయల ఈఎంఐలు కడుతూ బుల్లెట్ బైకులు కొంటున్నారు. తిండి కంటే ఇంజిన్ శబ్దమే ముఖ్యం అనుకోవడం ముఖ్యం అనుకుంటున్నారు. ఇది కేవలం వాహనం పట్ల మోజు కాదు, ఒక రకమైన అభద్రతా భావం నుంచి పుట్టిన కృత్రిమ దర్పం. బ్యాంక్ బ్యాలెన్స్ నిన్నాటికీ, ఇన్నాటికీ సున్నాగానే ఉన్నా, చేతిలో మాత్రం రూ.లక్ష ఐఫోన్ మెరవాల్సిందే. ఈ డిజిటల్ దర్పం యువతను పెడదోవ పట్టిస్తోంది. అవసరం కోసం ఫోన్ కాకుండా, అంతస్తును చాటుకోవడం కోసం ఆభరణంలా ఫోన్‌ను వాడటం వల్ల ఆర్థిక క్రమశిక్షణ అడుగంటుతోంది. ఎన్ని అప్పులున్నా, సమాజంలో తన పరపతి తగ్గకూడదనే భ్రమలో డాబూ దర్పం ప్రదర్శించడం వల్ల అసలు సమస్యలు బయటపడటం లేదు. పెళ్లిళ్లు, పేరంటాలు, పండుగల్లో స్థాయికి మించి ఖర్చు చేస్తూ, ఆ తర్వాత వడ్డీలు కట్టలేక తలవంచుకుంటున్నారు. లోపల డొల్లతనం ఉన్నా బయటకు మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారు. వీటివల్ల మానసిక ఒత్తిడి పెరిగి ఆత్మహత్యల వరకు దారితీస్తోంది.

### పల్లెల్లో ఈఎంఐల పద్మవ్యూహం

భారతదేశానికి పట్టుగొమ్మలైన పల్లె సీమల్లో నేడు ఒక నిశ్శబ్ద సంక్షోభం ఆవహిస్తోంది. అదే ఈఎంఐల సంస్కృతి. గతంలో గ్రామీణ రుణాలు వ్యవసాయ పెట్టుబడులకో లేదా అత్యవసరాలకో పరిమితమయ్యేవి. కానీ నేడు విలాస వస్తువులు, స్మార్ట్‌ఫోన్లు, బైక్స్, గృహోపకరణాల కొనుగోలుకు కూడా ఆధారమవుతున్నాయి. పట్టణీకరణ ప్రభావం, సామాజిక మాధ్యమాల వెల్లువతో గ్రామీణ యువతలో వినియోగవాదం పెరిగింది. బ్యాంకులు, మైక్రోఫైనాన్స్ సంస్థలు మరియు ఎన్‌బీఎఫ్‌సీలు సులభ వాయిదాలు అంటూ ఇంటి వద్దకే వచ్చి రుణాలు అందిస్తుండటంతో, ఆదాయానికి మించి ఖర్చు చేసే ధోరణి పెరిగింది. వ్యవసాయ ఆదాయం అనిశ్చితిగా ఉన్నా, నెలవారీ వాయిదాలు మాత్రం తప్పనిసరి కావడంతో సామాన్యులు తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారు. ఆస్తుల సృష్టి లోపించడం: తీసుకుంటున్న అప్పులు ఉత్పాదక రంగాల్లో కాకుండా, వినియోగ వస్తువులకే పరిమితమవుతున్నాయి. ఆదాయం తగ్గినా లేదా పంటలు దెబ్బతిన్నా, ఈఎంఐలు చెల్లించలేక అధిక వడ్డీలకు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించడం వల్ల అప్పుల ఊబి మరింత ముదురుతోంది. పెరుగుతున్న ఈఎంఐల వల్ల అత్యవసర సమయాల్లో చేతిలో నగదు లేక, గ్రామీణ కుటుంబాల ఆర్థిక స్థిరత్వం దెబ్బతింటోంది.

### మాయా లోకంలో యువత

మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి యువత జీవనశైలిలో పెను మార్పులు వచ్చాయి. ముఖ్యంగా కన్స్యూమర్ గూడ్స్ (స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, విలాసవంతమైన గృహోపకరణాలు) కొనుగోలులో యువత ప్రదర్శిస్తున్న ఉత్సాహం, వారిని తెలియకుండానే అప్పుల ఊబిలోకి నెడుతోంది. బై నౌ, పే లేటర్, నో కాస్ట్ ఈఎంఐ వంటి పథకాలు యువతను అమితంగా ఆకర్షిస్తున్నాయి. చేతిలో చిల్లిగవ్వ లేకపోయినా, కేవలం ఒక మొబైల్ యాప్‌తో లక్షల విలువైన వస్తువులను సొంతం చేసుకోవచ్చనే భ్రమలో పడుతున్నారు. ఇది తాత్కాలికంగా ఆనందాన్ని ఇస్తున్నా, భవిష్యత్తులో ఆదాయంలో మెజారిటీ భాగం వడ్డీలు, ఈఎంఐలకే సరిపోతోంది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాల్లో ఇతరుల జీవనశైలిని చూసి, వారితో పోటీ పడాలనే తపన యువతలో ఎక్కువవుతోంది. కొత్త మోడల్ ఐఫోన్, ట్రెండీ గ్యాడ్జెట్ లేకపోతే నామోషీగా ఫీలవుతున్నారు. అదే వారిని అనవసరపు ఖర్చుల వైపు మళ్లిస్తోంది. ఒకప్పుడు భారతీయులు పొదుపు చేయడంలో ప్రపంచానికే ఆదర్శంగా ఉండేవారు. కానీ ఇప్పుడు నికర గృహ ఆర్థిక పొదుపు కనిష్ట స్థాయికి పడిపోయింది. యువత తమ ఆదాయాన్ని ఆస్తుల సృష్టి, విద్యపై పెట్టుబడి పెట్టకుండా, క్షణికానందం ఇచ్చే వస్తువులకే ఖర్చు చేస్తున్నారు.

### రీల్స్ రింగులో బొంగరంలా..

యువతలో లగ్జరీ మోజు పెరగడానికి ప్రధాన కారణం సోషల్ మీడియా. స్నేహితులు, ఇన్‌ఫ్లుయెన్సర్ల విలాసవంతమైన పోస్టులను చూసి తమను తాము తక్కువ చేసుకుంటూ, అసంతృప్తికి లోనవుతున్నారు. దాదాపు 81 శాతం మంది యువత సోషల్ మీడియా ప్రభావంతోనే తక్షణమే వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఈ 'ప్రదర్శన సంస్కృతి' వల్ల అవసరం లేకున్నా ఖరీదైన వస్తువుల వెంట పడుతున్నారు. ఈ ధోరణి ఎంతగా విస్తరిస్తోందంటే, మొత్తం ఇళ్ల మార్కెట్‌లో లగ్జరీ గృహాల వాటా 2021లో 16 శాతంగా ఉండగా, 2026 నాటికి 27 శాతానికి చేరింది. అద్భుతమైన డిజైన్లు, ప్రీమియం వసతుల కోసమే కాకుండా, ఒక సామాజిక హోదాను ప్రదర్శించుకోవడం కోసం యువత విలాసాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

### బొంకుడే బొంకుడు

పని తక్కువ.. ప్రచారం ఎక్కువ అనేది కూడా ఒక వింత రోగంగా మారింది. ఏదైనా చిన్న పని చేస్తే దాని చుట్టూ చేసే హడావుడి, ఇచ్చే బిల్డప్పులు చూస్తుంటే అసలు పని కంటే ఆర్భాటమే ఎక్కువగా కనిపిస్తోంది. ఏ వ్యక్తి చూసినా కోతలు కోస్తున్నారు. అబద్ధపు మాటలతో కాలక్షేపం చేస్తున్నారు. వంద అబద్ధాలు ఆడి ఒక పెళ్లి చేయమన్నారు పెద్దలు, కానీ వేల అబద్ధాలు చెప్పి గొప్పగా చూపించుకోవాలనుకుంటున్నారు. ప్రస్తుత కాలంలో నిజం సచ్చిపోయిందని అనడం కంటే, అబద్ధం అందంగా అలంకరించుకుని సింహాసనం ఎక్కిందని చెప్పడం బెటర్. గతంలో ఒక మాట ఇస్తే అది ప్రాణంతో సమానంగా భావించేవారు. నేడు మాట ఇవ్వడమే అది తప్పడానికి అన్నట్లుగా ప్రవర్తిస్తున్నారు. జనాల్లో ఒక రకమైన పిచ్చి పెరిగిపోతోంది. అది డబ్బు పిచ్చి కావచ్చు, ప్రచార పిచ్చి కావచ్చు లేదా అధికారం కోసం ఆరాటం కావచ్చు. ఈ వ్యామోహంలో పడి ఎదుటివారిని ఎలా ముంచాలి? ఎలా బురిడీ కొట్టించాలి? అనే ఆలోచనలే రాజ్యమేలుతున్నాయి. సోషల్ మీడియా పుణ్యమా.. అని అబద్ధాలు రెక్కలు కట్టుకుని నిమిషాల్లో ఊరంతా తిరుగుతున్నాయి. అది నిజమో కాదో తెలుసుకునే తీరిక, ఓపిక లేని మరో వెర్రితనం మనది.

### ఇదీ లెక్క..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజా గణాంకాల ప్రకారం, భారతీయ కుటుంబాల ఆర్థిక అప్పులు.. ఆస్తుల పెరుగుదల కంటే వేగంగా (సుమారు రెట్టింపు వేగంతో) పెరుగుతున్నాయి. 2023లో సగటున రూ. 3.9 లక్షలుగా ఉన్న ఒక్కో రుణగ్రహీత అప్పు, 2025 నాటికి రూ.4.8 లక్షలకు చేరుకుంది.

గ్రామీణ ప్రాంతాల్లో మార్చి 2025 నాటికి మొత్తం గృహ రుణాల్లో 55% వాటా కేవలం వ్యక్తిగత, వినియోగ రుణాలే ఉండటం.

భారతీయ కుటుంబాల మొత్తం అప్పులు దేశ జీడీపీలో 41.3%కి చేరుకున్నాయి. ఇది గత ఐదేళ్ల సగటు (38%) కంటే ఎక్కువ.

2019 నుండి 2025 మధ్య కాలంలో కుటుంబాల ఆస్తులు 48% పెరిగితే, అప్పులు 102% పెరిగాయి. అంటే ఆస్తుల కంటే అప్పులు రెట్టింపు వేగంతో పెరుగుతున్నాయి.

ఒక్కో రుణగ్రహీతపై ఉన్న సగటు అప్పు కేవలం రెండేళ్లలో (మార్చి 2023 - మార్చి 2025) రూ. 3.9 లక్షల నుంచి రూ. 4.8 లక్షలకు (23% పెరుగుదల) పెరిగింది.

మొత్తం కుటుంబ రుణాలలో దాదాపు 55% వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డులు, వినియోగ వస్తువుల కోసమే తీసుకుంటున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో తీసుకున్న రూ. 2.3 లక్షల కోట్ల రుణాలలో, 6.4% రుణాలు 30 రోజుల కంటే ఎక్కువ కాలం బకాయిలుగా ఉన్నాయి. ఇది పట్టణ ప్రాంతాల (6%) కంటే ఎక్కువ.

మైక్రోఫైనాన్స్ రంగంలో మొండి బకాయిలు (ఎన్పీఏలు) గత ఏడాదితో పోలిస్తే 1.6% నుండి 4.8% కి పెరిగాయి. అంటే చిన్న రుణాలు తీసుకునే గ్రామీణ పేదలు వాయిదాలు చెల్లించలేక ఇబ్బంది పడుతున్నారు.

గ్రామీణ, సెమీ-అర్బన్ ప్రాంతాల్లో వ్యక్తిగత రుణాల వృద్ధి రేటు ఏడాదికి 15% గా నమోదైంది. ఇది బంగారు రుణాలు (7%), వినియోగ వస్తువుల రుణాల (9%) కంటే అధికం.



### మనోళ్ల సోకులు ఇలా..

క్రెడిట్ కార్డులతో అవసరం లేని వస్తువులు కొనడం.
సోషల్ మీడియాలో ఫొటోల కోసం అప్పులు చేసి టూర్లకు వెళ్లడం.
ఈఎంఐల పేరుతో ఆదాయానికి మించి గ్యాడ్జెట్లు కొనడం.

### వాస్తవంలోకి రా భయ్యా..!

ఆదాయంలో కేవలం 20-30% మాత్రమే విలాసాలకు కేటాయించి, కనీసం 20% పొదుపు చేయాలి.
సోషల్ మీడియాలో కనిపించే ప్రతిదీ నిజం కాదని, అది కేవలం ఒక 'ఫిల్టర్' చేసిన ప్రపంచమని అర్థం చేసుకోవాలి.
హోదా కోసం కాకుండా, నాణ్యత, అవసరానికి అనుగుణంగా నిర్ణయాలు తీసుకోవాలి.

### రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!

పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.